*సంపాదకీయం*

# చరిత్రను మలుపు తిప్పిన చైతన్య మూర్తులు

## (విముక్తి ఉద్యమాలకి ప్రాణం పోసిన తెలంగాణ స్త్రీలు)

రకరకాల అణచివేతలను ధిక్కరిస్తూ దశాబ్దాల తరబడి పోరాడిన తెలంగాణ తనను తాను విముక్తం చేసుకునే దిశగా తొలి అడుగు వేస్తున్నది. ఈ సందర్భంలో పురుషాధిక్య సమాజాన్ని సవాలు చేస్తూ చరిత్రలో ఎదిగిన చైతన్యమూర్తులైన తెలంగాణ ఉద్యమకారిణుల గురించి మాట్లాడుకోవడం అంటే వర్తమానాన్ని మరింత ప్రజాస్వామికంగా మలుచుకోవడానికి చేసే ఒకానొక ప్రయత్నమే. ఈ ప్రయత్నంలో భాగంగానే తెలంగాణ పోరాట చరిత్ర లోకి తొంగి చూస్తే కనిపించే చైతన్య దీపాలెన్నో. సామాజిక, రాజకీయ చైతన్యం కల్గిన స్త్రీలు అత్యధికంగా వున్న ప్రాంతంగా దేశంలోనే గుర్తింపు పొందిన తెలంగాణ చరిత్ర ఎందరో స్త్రీలకు స్ఫూర్తిదాయకమైందన్న విషయం అర్ధమౌతుంది.

ఆధునిక భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి బెంగాల్ ప్రతీకగా నిలిచిపోయినప్పటికీ ఆనాటికే తెలంగాణ సంతరించుకున్న అత్యాధునిక విలువలనూ, సాధింపదలుచుకున్న స్థానిక ఆకాంక్షలనూ గనుక అర్థం చేసుకోవాలనుకుంటే ఆనాటి సామాజిక రాజకీయ రంగాల్లో అత్యంత చైతన్యంతో పనిచేసిన స్త్రీల చరిత్రను అధ్యయనం చేయడం తప్పనిసరి అవుతుంది. అప్పటి వారి సామాజిక, రాజకీయ కార్యాచరణలు యూరప్ కేంద్రంగా తోసుకువచ్చిన ఆధునికతకు భిన్నంగా స్థానికతా పునాదులపై తెలంగాణ సాధించుకున్న వివేచనకు ఆనవాళ్ళుగా కన్పిస్తై. వలసపూర్వ రాజ్యవ్యవస్థలోని రాచరిక ఆధిపత్యాన్ని ఎదుర్కొన్న ఆదివాసీ స్త్రీల పోరాట స్ఫూర్తి, స్త్రీలకే గాక యావత్తు తెలంగాణ సమాజానికి ఆదర్శమైంది. అందుకే సమ్మక్క, సారలమ్మలు పూజలందుకునే దేవతలయిండ్రు. ఈ నేపథ్యం తనదైన ఆధునికతను సంతరించుకుంటున్న తెలంగాణని కొత్త ఉద్యమాలకు పురిగొల్పింది. అచ్చమాంబ లాంటి విద్యావంతులైన స్త్రీల వివేచన గ్రంథాలోద్యమానికి దారులు తెరిచింది. 1901లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం ఏర్పాటుతో గ్రంధాలోద్యమం మొదలైంది. 1919లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడే నాటికి గ్రంథాలోద్యమం తెలంగాణ వ్యాప్తంగా స్త్రీ పురుషులను విద్యావంతులుగా, మార్పును కోరే సమూహాలుగా సంసిద్ధులను చేసింది. తెలంగాణ ఎంచుకున్న గ్రంథాలోద్యమంతో సాహిత్య కళారంగాల మీదుగా స్త్రీ చైతన్యంలో మొదటిదశ ప్రారంభమైంది.

హైద్రాబాద్ కేంద్రంగా 1908 నాటి వరద బాధితులకి సాయంగా పనిచేసిన సరోజినీ నాయుడి సామాజిక చైతన్యం పట్టణ ప్రాంత స్త్రీలకు ఆదర్శమైంది. కవయిత్రిగా ఆమె దేశవ్యాప్త

గుర్తింపు తెలంగాణకే గర్వకారణమైంది. అప్పటి తరాన్ని రాజకీయ కార్యాచరణకు పురిగొల్పింది. 'హింద్' అనే జాతీయ వాద పత్రికను ప్రారంభించిన బేగం ఖుర్షిద్ ఖ్వాజా, హైద్రాబాదు సంస్కరణల కోసం ఒకసంస్థను స్థాపించి పనిచేసిన హమీనా హైదరీ, రుస్తుంజా సర్దురిజా లాంటి వాళ్లు ఈ కోవలోకి వస్తరు. 1916లో వీరి పూనికతో స్థాపించబడిన ఈ సంస్కరణల సంఘం స్త్రీవిద్యకోసం పనిచేసింది. బ్రిటిష్ వలస వ్యతిరేక ఉద్యమంలో సత్యాగ్రహులుగా సరోజినీదేవి వారసత్వాన్ని ముందుకి తీసుకెళ్తూ పద్మజానాయుడు (1900) సర్జూబాయి (1909) సంగం లక్ష్మీబాయి (1911) సత్యవతి (1916) జ్ఞాన కుమారి హెగ్డా (1918) సుమిత్రాదేవి (1918) విమలా బాయి మెల్కోటె (1910) అహల్యాబాయి (1929) మొ॥ స్త్రీలెందరో పబ్లిక్ రంగంలో ప్రత్యక్ష రాజకీయాల్లో పాలుపంచుకోవడం మొదలైంది.

ఇదే కాలంలో అంచులకు తోసివేయబడిన నిమ్న వర్గాల స్వేచ్ఛాన్వేషణా, కుల వివక్షలను నిలువరించే సామాజిక న్యాయ ఆకాంక్షలు ఆదిహిందూ సోషల్ లీగ్‌ని సంస్కారణోద్యేయంగా ముందుకు తెచ్చింది. దళిత వర్గాల అభ్యున్నతికోసం, బాలికల విద్యకోసం నిరంతరంగా పనిచేసిన ఈ బృందాల్లో స్త్రీలు కూడా పాల్గొనేవారు. బేగం సుగ్రా హుమాయున్ మీర్జా, బేగం తాయెబా బిల్‌గ్రామీ వంటి వారు 1919 నాటికి హైద్రాబాదులో బాలికల పాఠశాలలు నెలకొల్పింద్రు. ఆది హిందు పరిషత్, ఆంధ్ర జన సంఘం వంటి గ్రూపులు 1921 నాటికి ప్రజల హక్కులకోసం పనిచేయడం ప్రారంభించినై. వర్ణవ్యవస్థలో తీవ్ర వివక్షలకు గురయిన కులాల స్వేచ్ఛాన్వేషణ, బ్రిటిష్ వలసవాద పోరాటాలు జమిలిగా సాగిన ఈ దశలో దళిత నాయకుల దార్శనికతకు మధ్యతరగతి విద్యావంతుల (బ్రిటిష్) వలస వ్యతిరేక అవగాహనలు తోడయినై. ఉధృతంగా సాగుతున్న బ్రిటిష్ వ్యతిరేక రాజకీయ, సామాజిక సందర్భంలో ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ అనే ఐక్య సంఘటనా దృక్పదంతో స్థానిక ఉద్యమాలను నిర్మించిన చైతన్యం అప్పటి తెలంగాణది. ఈ చైతన్యం స్త్రీల సాహిత్య కళారంగాలలోనే గాక సామాజిక కార్యాచరణల్లో స్పష్టంగా ప్రతిఫలించింది. 1916 నాటికే ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ హైద్రాబాద్ కేంద్రంగా ప్రారంభ మైంది. స్త్రీలలో విద్యాతృష్ణను పెంచి వ్యక్తీకరణ స్పృహను రగిలించిన ఈ తొలితరం ఉద్యమాల ప్రతిస్పందనలు 1920ల నాటికి తెలంగాణ మారుమూల సంస్థాన పల్లెల్లో కూడ ప్రతిఫలించినై. కొల్లాపూర్ కేంద్రంగా స్నేహలతా కవితా సంఘం వంటి సాహిత్య సాంస్కృతిక గ్రూపులు మహిళల పూనికతో పనిచేయడం మొదలైంది. గద్వాల ఆదిలక్ష్మీ దేవమ్మ, సరస్వతీ దేవి, చిన్నాంబ, శంకరమ్మ వంటి రాణులు స్త్రీల అభ్యున్నతికై సహకారాలందించేవారు. ఈ దశలోని మహిళా చైతన్యానికి ప్రతిస్పందనగా నైజాం రాజ్యం స్త్రీ కార్మిక ఆధారిత కేంద్రంగా ఆజంజాహీ మిల్స్‌ని ఏర్పర్చుడాన్ని చెప్పుకోవచ్చు.

'విద్య అన్నది' స్త్రీలకు అత్యవసరమన్న పులుగోటి వెంగమాంబ వంటి విద్యావంతులైన స్త్రీల దార్శనికత ఆ కాలంనాటి స్త్రీల కవిత్వాన్ని నడిపించింది. 1925లో నడింపల్లి సుందరమ్మ, మాడపాటి మాణిక్యమ్మ, టి. వరలక్ష్మమ్మల చొరవతో 'ఆంధ్ర సోదరీ సమాజం' పనిచేయడం మొదలైంది. హైద్రాబాదులో బాలికల ఉన్నత పాఠశాల (1928) ఏర్పాటుకై ఇలాంటి స్త్రీలెందరో సంఘటితంగా పనిచేసారు. అదే చైతన్యం 1930ల నాటికి ఆంధ్ర మహిళా సభలో సంస్థాగతంగా సంఘటితమై పబ్లిక్ రంగంలోకి విస్తరించింది. ఆరుట్ల కమలాదేవి (1921) అహల్యాబాయి (1929) సీతాదేవి, పి. సత్యవతీబాయి, చాట్రాతి లక్ష్మినరసాంబ,యశోదాదేవి, ఇందిరాదేవి, కె. లక్ష్మీబాయి, కనకవల్లి, రాజమ్మ, వంశీబాయి, అరిగె లలితాదేవి, బూర్గుల అనంతలక్ష్మి, భారతీ రత్నాకరాంబ, సీతారత్నం, డా॥ చంద్రమతి, విఠోబాయి మొ॥వారు 1944 నాటికి ఆంధ్ర మహాసభ చీలిపోయేవరకు మహిళాసభలను విజయవంతంగా నడిపారు. ఇదేకాలంలో, సంస్కరణ వాదులుగా జాతీయ వాద దృక్పథాలతో పనిచేస్తున్న ఈ సంస్థలకు సమాంతరంగా, రాజకీయార్థిక వాదంతో కమ్యూనిస్టు దృక్పథాలతో పనిచేసే స్త్రీల చొరవతో 'మహిళా నవజీవన మండలి' ఏర్పాటయింది. ప్రమీలతాయి, సర్జూబాయి, యశోదాబాయి, డా॥ అచ్చమాంబ, ప్రమీలగుప్తవంటి వామపక్ష రాజకీయుల పూనికతో అన్ని వర్గాల, సమూహాల స్త్రీలు సంఘటితమైన సందర్భం తెలంగాణ స్త్రీల చరిత్రలో రెండో దశగా చెప్పొచ్చు. నీలోఫర్ (1942) దుర్రెషవర్ (1942) లీలాకుమారి నాయుడు, ప్రమీలా గుప్త,కుమారి దేవి, ఓబుల్‌రెడ్డి రంగమ్మ, మల్లమ్మ, లక్ష్మి, హేమలతాగుప్త, బ్రిజ్‌రాణిగౌర్ (1949) కరుణ చౌదురి మొ॥వారు స్త్రీల కోసం పనిచేసే గ్రూపులను ఏర్పర్చడంలోనూ, ఇక్కట్లలో వున్న స్త్రీలకు అవసరమైన సహాయం చేయడంలోనూ ముందుండేవారు.

ఉస్మానియా యూనివర్సిటిలో మొదలైన వందేమాతర ఉద్యమం (1938) విద్యార్థుల్లో చైతన్యాన్ని రగిలించింది. (మ్రోయు తుమ్మెద అనే నవలలో విశ్వనాథ సత్యనారాయణ గారు ఈ కాలపు సంఘటనలను కొన్నింటిని ప్రస్థావించారు.) విద్యార్థులను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చిన ఈ చైతన్యం సోషలిస్టు భావాలతో ఉత్తేజం పొందిన వారందరిని కలుపుకొని 'కామ్రేడ్స్ అసోసియేషన్' గా ఏర్పడేందుకు కారణమయింది.ఎందరో ముస్లీం మేధావుల ఉద్యమ భాగస్వామ్యానికి వేదికగా  కూడా ఈ అసోసియేషన్ పనిచేయడం ప్రారంభించింది. ఈ నేపథ్యం 1939లో విద్యార్థినుల భాగస్వామ్యంతో All Hyderabad Students Union ఏర్పాటుకు దారితీసింది. ఇంచుమించుగా ఇదేసమయంలో సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రగతిశీల దోరణుల కొనసాగింపుకు Progressive Writers Association పనిచేయడం మొదలైంది. మగ్దూం, నాజర్ హైద్రాబాదీలతో పాటుగ ఎందరో స్త్రీలు ఈ భావాలకు ఉత్తేజితులై పనిచేసేవారు. ప్రముఖ హైద్రాబాద్ రచయిత్రులైన జీనత్‌సాజిదా, జిలానిబానో వంటి వారిని

ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఐతే తెలంగాణ సాయుధ పోరాటానికి హైద్రాబాదు కేంద్రంగా భూమిక నిర్మించిన పై సంఘాలతో మమేకమై పనిచేసిన చరిత్ర కెక్కని స్త్రీలు మరెందరో వున్నారు. ఈ స్త్రీల, విద్యార్థుల చైతన్యం, ఆంధ్రమహాసభ వామపక్ష రాజకీయ నాయకత్వం సమిష్టిగా గ్రామీణ ప్రజా బాహుళ్యాన్ని సమీకరించడంలో విజయం సాధించాయి. వివిధ స్థాయిల్లో పరిమితులు న్నప్పటికీ స్త్రీల క్రియాశీల భాగస్వామ్యాన్ని అప్పటి పురుష నాయకత్వం ఆహ్వానించింది. ఎందరో స్త్రీలు ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణకు దిగింద్రు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య నలుగుతున్న ప్రపంచ సందర్భం, కార్మిక ఉద్యమాలు, స్థానిక పెత్తందార్ల తీవ్ర అణచివేత, స్థానిక మహిళా సంస్కర్తల పోరాట స్ఫూర్తి తెలంగాణ గ్రామీణ స్త్రీల పోరాటాలకు నేపథ్యాన్నిచ్చినై.ఎమ్మా గోల్డ్‌మన్ వంటి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఉద్యమకారిణుల చైతన్యాన్ని ప్రతిఫలించే రాజకీయ స్పృహను తెలంగాణ గ్రామీణ స్త్రీలు అవలీలగ అందిపుచ్చు కున్నరు. బ్రిటిష్ వలస వ్యతిరేక ఉద్యమంలో తమ కలాలతో, గళాలతో పాల్గొన్న పట్టణ మధ్య తరగతి మహిళలకు భిన్నంగా ఆయుధాలు పట్టి భూస్వామ్య వ్యతిరేక ఉద్యమంలో దూకిన చైతన్యం తెలంగాణ గ్రామీణ స్త్రీలది. గుతుపల సంఘం సభ్యులుగా వీరు ఆయుధాలు పట్టడంతో తెలంగాణ స్త్రీల చైతన్యంలో మూడవ దశ మొదలైంది.

చిట్యాల ఐలమ్మ సాహసం ఇచ్చిన స్ఫూర్తి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజాలు వేసింది.ఆకునూరు, మాచిరెడ్డి పల్లెల్లో స్త్రీలపై జరిగిన పాశువిక దాడులు, నల్లగొండ జిల్లాలో వందల మంది స్త్రీలకు రజాకార్లను ఎదురించే సందర్భాలను సమకూర్చినై. వయసుతో నిమిత్తం లేకుండా స్త్రీలు సాయుధ దళాలుగా ఏర్పడిన ఈ దశ తెలంగాణ స్త్రీల అత్యున్నత రాజకీయ స్పృహకు, కార్యాచరణలకు సంకేతమైంది. అంతవరకు సంస్కరణ ధ్యేయంతో స్త్రీల అభ్యున్నతికోసం పనిచేసిన ఉద్యమాలకి భిన్నంగా తొలిసారి స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించగలిగిన, పితృస్వామ్య భావజాలాన్ని దిక్కరించే కార్యాచరణల నెంచుకోవడం మొదలైంది. తుపాకీకి ఎదురు నిలిచి పోరాడిన దశనుంచి తుపాకీ పట్టి యుద్ధరంగం లోకి ఉరికిన దశ ఇది. స్థానిక పెత్తందార్లను, రజాకార్లను, యూనియన్ సైన్యాన్ని ఎదురించే క్రమంలో ఎందరో స్త్రీలు ప్రాణాలర్పించారు. 11 సంవత్సరాల రాములమ్మ (1937) సైన్యానికి ఉద్యమకారుల ఆచూకీ చెప్ప నిరాకరించడంతో దారుణ హత్యకు గురయింది. యెల్లమ్మ, బుచ్చమ్మలు కూడా సైన్యం చేతిలో చిత్రహింసల పాలై మరణించారు. ఐతే ఇలాంటి సంఘటనలకు స్త్రీలు భయపడిన దాఖలాలు అరుదు.

ఈ అణచివేతల్నుంచి మరింత ఎగిసిన స్త్రీల చైతన్యం భూమి పంపిణీ, వెట్టి చాకిరీ రద్దు వంటి కార్యక్రమాల నెంచుకొని మరింత ఉధృత ఉద్యమానికి దారులు వేసింది. టెనెన్సీ ఆక్ట్ సాధించింది. ఈ ఉద్యమ ప్రస్థానంలో సర్వస్వం ధారపోసిన వారెందరో. అందులో చిట్యాల

ఐలమ్మ, కమలమ్మ, ప్రియంవద, సుగుణమ్మ, ప్రమీలాతాయి, దూడల సాలమ్మ, అచ్చమాంబ, జమాలున్నీసా బాజీ, రజియా బేగం, లలితమ్మ, అడివమ్మ లాంటి కొందరు ఉద్యమకారిణుల చరిత్ర మాత్రం స్త్రీవాదుల పూనికతో నమోదైంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో ఇక హైద్రాబాదు రాజ్యాన్ని భారత యూనియన్‌లో కల్పుకోవాలనే వాదనలు ప్రబలుతున్న కాలమది. హైద్రాబాదు రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేయాలనే ఉద్యమానికి ఉదార వాద సంస్థలైన ఆర్యసమాజ్, స్టేట్ కాంగ్రెస్‌లు పూనుకోవడంతో ఎందరో స్త్రీలు పాల్గొనడం మొదలైంది. ఆర్యసమాజ్ ఇచ్చిన పిలుపు మేరకు బేగం బజార్‌లో జెండా ఎగురవేసి అరెస్టు అయిన వారిలో బ్రిజ్‌రాణిగౌర్, యశోదాబాయి, సత్యవతి, సుమిత్రాదేవి, విమలాబాయి లాంటి వారిని కొందరిని చెప్పొచ్చు.

స్థానిక దృక్పదాల్లోంచి జాతీయ వాద సంస్కరణోద్యమాల దిశగా సాగిన తెలంగాణ స్త్రీల చైతన్యం, తెలంగాణ సాయుధ పోరాట కాలానికి స్పష్టమైన స్త్రీ దృక్కోణాల్లోంచి కార్యాచరణల నెంచుకునే దశకుచేరింది. ఆపైన వరుసగ జరిగిన పరిణామాల్లో తెలంగాణ పరిస్థితి, మరీ ముఖ్యంగా తెలంగాణ స్త్రీల పరిస్థితి పూర్తిగ దిగజారింది. ఐనా నివురు గప్పిన నిప్పులా వున్న స్వేచ్ఛాకాంక్ష తెలంగాణను ముల్కీ ఉద్యమానికి పురిగొల్పింది. 1969 నాటికి ప్యారిస్ ఉద్యమానికి ధీటుగా తెలంగాణ విద్యార్థి ఉద్యమం ఊపందుకున్నది. ఉవ్వెత్తున లేచిన ఆ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో మరణించిన విద్యార్థుల్లో రేణుక అనే విద్యార్థిని కూడా ఒకరు. సాయుధ పోరాటం తర్వాత చతికిల పడిన మహిళా చైతన్యం ఒక్కసారి 69 ఉద్యమంతో తిరిగి జవసత్వాలు తెచ్చుకున్న దశ నాలుగోదశ. వేలమంది స్త్రీలు రోడ్లమీదకు స్వచ్ఛందంగా కదిలిన ఈ స్త్రీల చరిత్రను ఇంకా రికార్డు చేయాల్సే వుంది. ఒక్క బేలాచౌరస్తా గల్లీలోనే వందల సంఖ్యలో స్త్రీలు ఉద్యమకారిణులుగా కొనసాగింద్రంటే 69 ఉద్యమంలో స్త్రీల చైతన్య స్థాయి ఎటువంటిదోఅంచనా వేయొచ్చు. సదాలక్ష్మి, సుమిత్రా దేవి, శాంతాబాయి, ఈశ్వరీబాయి, డా॥ దేవకీదేవి, డా॥ పద్మ, రమాదేవి, నాంచారమ్మ, స్వదేశ్‌రాణి, బోల్గం సక్కుబాయి వంటి ఉద్యమకారిణుల అనుభవాలను ఇంకా రికార్డు చేయాల్సివుంది.

ఆపైన తీవ్ర అణచివేతల మూలంగా కుంగిన 69 ఉద్యమ చైతన్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పూర్తి నిస్తేజంలోకి వెళ్ళే పరిస్థితులు దాపురించినై. ఈ దశలో స్థానికుల భాషలూ, రీతి రివాజులూ వెక్కిరింతలకు గురవడమే గాక తెలంగాణీయుల వ్యక్తీకరణ అవకాశాలు పూర్తిగ రద్దయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ స్త్రీలు నల్లజాతి స్త్రీల మాదిరి రెండు విధాలైన వివక్షల్లో కూరుకు పోయింద్రు. మూడోతరగతి పౌరుల వలె జీవించాల్సి రావడం, అంతర్గత వలస వాదుల దోపిడీ పాలసీలు, వనరుల విధ్వంసం, తెలంగాణ గ్రామాలకు గ్రామాలు ఎడారులుగా మారడం లాంటి పరిస్థితులు తెలంగాణ స్త్రీలను నిస్తేజంలోకి నెట్టివేసిన కాలమది.

మూతపడిన స్థానిక మిల్లుల, ఖాయిలాపడిన పరిశ్రమలలోని కార్మికులు, గ్రామీణ పేద, మధ్య తరగతి స్త్రీలు అడవిదారి పట్టిన సందర్భం కూడా ఇదే. అడవి బిడ్డల ఆస్తులపై కన్నుపడిన పాలకులు పన్నే ధ్వంసరచనను అడ్డుకున్న కొమరం సోంబాయి (1940) నుంచి బెల్లి లలితల వరకు మధ్యకాలంలో ఎందరో స్త్రీలు ఎన్నో మిలిటెంట్ ఉద్యమాల్లో పోరాడి చనిపోయారు. ఒక్క ఉత్తర తెలంగాణలోనే స్నేహలత, లలిత, పద్మ, నిర్మల, హసీనా,రాజవ్వ, సమ్మక్క, స్వర్ణ, రుక్మాబాయి,రంగవల్లి వంటి వందమందికి పైగా అమరులైన ఉద్యమకారిణుల చరిత్ర నమోదైందంటే ఆయా ఉద్యమాల్లో ఎంతమంది తెలంగాణ స్త్రీలు పాల్గొన్నారో అంచనా వేయొచ్చు.

మొత్తానికి 1970ల నుండి 1990ల చివరివరకూ తెలంగాణ స్త్రీల చైతన్యం తీవ్ర నిర్బందాలకు గురైంది. అది భాషాపరంగా కావొచ్చు, సంస్కృతి పరంగా కావొచ్చు, విద్యా ఉ ద్యోగ ఉపాది రంగాల్లో కావొచ్చు, రాజకీయ విశ్వాసాల మూలంగా కావొచ్చు, వలసాభివృద్ధి భావజాలం వల్ల కావొచ్చు మొత్తానికి తెలంగాణ స్త్రీల పరిస్థితి పూర్తిగా దిగజారింది. మరీ ముఖ్యంగా గ్రామీణ దళిత బహుజన మహిళల చైతన్యాన్ని సంపూర్ణంగా రద్దుచేసే సందర్భాలు చట్టబద్ధమైనై. ఈ సందర్భంలోంచి వెల్లువెత్తిన మలితరం ఉద్యమంలో తెలంగాణ స్త్రీలు అత్యంత చైతన్యంతో పాల్గొన్నారు. (సీమాంధ్ర ఆధిపత్య శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారిన శ్రీకృష్ణ కమిటీ సభ్యులు సైతం తమ రిపోర్టులో స్త్రీలకోసం కేటాయించిన ఒక్క పేజీలో, ఎక్కువమంది తెలంగాణ స్త్రీలు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నరని ప్రస్థావించింది) ఐతే అంతర్గత వలసలో అణచివేతకు గురైన స్థానిక పురుషుల్లో పెచ్చరిల్లిన అనేకానేక పెడదోరణుల్లో భాగంగా మలితరం ఉద్యమంలో స్త్రీల చైతన్యాన్ని గుర్తించి గౌరవించ నిరాకరించే తత్వం అన్నిస్థాయిల్లోని పురుషుల్లో ప్రబలింది. ఈలాంటి ధోరణులు ప్రబలడం మూలంగా మలిదశ ఉద్యమంలో వేలాదిగా పాల్గొన్న స్త్రీల భాగస్వామ్యాన్నిరద్దుచేసే విద్యావంతుల ప్రకటనలూ, వేదిక మీద తమతోటి ఉద్యమకారిణులైన స్త్రీలను గమనించలేని నిస్తేజాలూ సర్వసాధారణమైనై. అంతేకాదు, ఇవే ధోరణులు మలిదశ ఉ ద్యమంలో స్త్రీలు పాల్గనలేదు అన్న ప్రచారాలకు పూనుకున్నై. నిజానికి 2009లో ఉ ద్యమం రగులుకుంటున్న తొలివారంల కళింగభవన్‌ల ఏర్పాటయిన భారీ ఉద్యమ సన్నాహక సభలో తెలంగాణ మహిళా జాక్ ఉద్యమంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఉద్యమ ప్రణాళిక గురించి ఒక నోట్ తయారుచేసింది (నేను స్వయంగా అందిచ్చిన ఆ నోట్‌ని సభాముఖంగా కేసిఆర్ గారు చదివి ప్రకటించారు.అవే కార్యక్రమాలు తరవాతి రోజుల్లో ప్రజలను సంఘటితం చేసినై). ఎన్నో ప్రతికూల పరిస్థితులను తట్టుకొని, ప్రశ్నించే స్వభావాన్ని కోల్పోకుండా, స్త్రీలు తమ చైతన్యాన్ని మలిదశ ఉద్యమంలో నిర్మాణాత్మకంగా మలచిన ఇలాంటి సంఘటనలు ఎన్నోవున్నై. ఇలాంటి స్త్రీల ఆచరణలను ముందుతరాలకు అందచేసే చారిత్రక భాద్యతను తెలంగాణ ఉద్యమం తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్ (ముక్త) మీద మోపింది. తెలంగాణ స్త్రీల హక్కుల ప్రకటనలో

భాగంగా ముక్త ఈ భాధ్యతను నెరవేరుస్తుందనే అభిలషిద్దం. ఈ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక సంచికతో మొదలైన తెలంగాణ ఉద్యమకారిణుల అనుభవాలను దశలవారి బులిటెనులుగా ప్రకటించాలనుకుంటున్న ముక్తకి అందరి సహకారం లభిస్తుందనే నా నమ్మకం.

*- విమల .కె*

# ముక్త : తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్ మేనిఫెస్టో – 2014

*( 2014 ఎన్నికల ముందే అన్ని పార్టీలకు, ఉద్యమసంస్థలకు అందజేసిన డిక్లరేషన్)*

* తెలంగాణ కోసం, నూతన సమాజం కోసం కలగంటూ నేలకొరిగిన అమరవీరులకు నివాళిగా మెమోరియల్ పార్క్‌తో పాటుగా ఒక “తెలంగాణా కల్చర్ సెంటర్” నిర్మించాలె. గ్రామీణ, పట్టణ ప్రాంత మేధావుటూ, రచయితలూ, కళాకారులూ, కవులూ, ఉద్యమకారులు కలిసి చర్చలు నిర్వహించుకునేటందుకు ఈ సెంటర్‌లో ఉచితంగా హాల్ లాంటి సౌకర్యాలను కల్పించాలె. ప్రగతిశీల ఆలోచనలకూ ఆచరణలకు దారులు వేయాలె.
* అమరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇవ్వాలె. ఉద్యమ సందర్భంలో విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలె.
* స్త్రీల శరీరాలను, జీవితాలను మార్కెట్ సరకుగా చిత్రించి నియంత్రించచూసే వినియోగదారీ సంస్కృతిని తిరస్కరించాలె.
* 2015 సంవత్సరాన్ని తెలంగాణా మహిళా సంవత్సరంగా ప్రకటించుకోవాలె. మాతృస్వామిక ప్రజాస్వామ్య వైఖరులకు ఊతమియ్యాలె.
* రాజకీయ పార్టీలతో సంబంధంలేని మేధావులతో కూడిన రాష్ట్రప్రణాళిక సంఘాన్ని నియమించాలె. అందులో 50% మహిళా మేధావులకు భాగస్వామ్యం ఉండాలె. తెలంగాణా రాష్ట్ర నిర్మాణానికి, అభివృద్ధికి కావలిసిన ప్రణాళికలు రచించడంలో ‘స్థానికత’ తాత్విక భూమిక కావాలె.
* ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు 3 ఏళ్ళకు మించకూడదు.
* అవశేష ఆంధ్రప్రదేశ్‌కి సీమాంధ్రరాష్ట్రం లేదా అక్కడి దళిత సంఘాల ప్రతిపాదన మేరకు కొత్తపేరును వెంటనే నిర్ణయించాలె.
* సామాన్యునితో పాటుగా సమస్త జీవావరణానికే ప్రమాదంగా పరిణమిస్తున్న వివేచన లేని పట్టణీకరణ ప్రణాళికలను పునఃసమీక్షించాలె. హెచ్.యం.డి.ఎ. విస్తరణ ప్రణాళికలను రద్దుచేయాలె.

* తెలంగాణలో ప్రస్తుతం ఉన్న సీమాంధ్ర ఉద్యోగులు త్వరలో బదిలీ చేయించుకొని తమ సొంత రాష్ట్రానికి వెళ్ళాలె. ఇక్కడే ఉండదల్చుకుంటే వారు తమ పెన్షన్లను వదిలేసుకొనే షరతుమీద ఉండే ఆప్షన్ ఇవ్వాలె.
* 2 సం.ల లోపలనే రెండు రాష్ట్రాలకు 2 హైకోర్టులు ఏర్పర్చాలె.
* ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసి కౌన్సిల్ లకు స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వాలె.
* మహిళల శరీరాలపై జీవితాలపై జరుగుతున్న హింసను అడ్డుకోవాలె. వెంటనే తెలంగాణా మహిళా కమీషన్ ప్రకటించాలె. మైనారిటీ స్త్రీల కోసం ప్రత్యేక మహిళా కమీషన్ విభాగాన్ని ఏర్పర్చాలె. మహిళలకోసం చేసిన చట్టాలను పటిష్టంగా అమలుపర్చాలె. ఎక్సైజ్, విద్య, మీడియా వంటి రంగాల్లో తెలంగాణా మహిళా కమీషన్‌కి, ఆయా శాఖల ప్రణాళికలలో సంపూర్ణ నిర్ణయాధికారాన్ని ఇవ్వాలె. జిల్లా మహిళా కమిటీలు కమీషన్‌తో సమన్వయం చేసుకుంటూ ఆయా రంగాల్లో ప్రణాళికల అమలుకు పనిచేయాలె.
* మహిళా పంచాయితీలను ప్రోత్సాహించాలె. కుల వర్గ ప్రాంత అసమానతల్లో మగ్గుతున్న స్త్రీలకు ఈ పంచాయితీలు 'కౌన్సిలింగ్' సెంటర్స్‌గ ఉపయోగపడాలె. ఆదివాసి, దళిత, బహుజన స్త్రీల నాయకత్వానికి సంపూర్ణ ఆమోదాన్నితెలుపగలిగే సామాజిక అవగాహనలను పెంచాలె.
* రాష్ట్ర విద్యా కమీషన్‌ని నియమించాలె. ప్రాంతీయ విద్యా ప్రణాళికలను రూపొందించాలె.
* స్త్రీల ఉన్నత విద్యావకాశాలు మెరుగుపర్చడం కోసం తక్షణ ప్రణాళికలు యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలె. వెంటనే 2 మహిళా యూనివర్సిటీలను నెలకొల్పాలె. వక్ఫ్ భూములను వెనక్కి తీసుకొని ఓల్డ్ సిటీలో ఒక సెంట్రల్ 'మహిళా విశ్వ విద్యాలయాన్ని' ఏర్పాటు చేయాలె. ఒక స్టేట్ మహిళా యూనివర్సిటీని మహబూబ్ నగర్ జిల్లాలో నెలకొల్పాలె.
* జిల్లాల వారీగా మానవ, సామాజిక శాస్త్రాల్లో ఉన్నత విద్యా మండళ్లను ఏర్పాటు చేయాలె. వాటిల్లో ఉమెన్ స్టడీస్ విభాగాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలె.క్రీడల్లో స్త్రీలకు ప్రత్యేక బోర్డు ఉండాలె.
* ప్రైవేటు బళ్ళను నిషేదించి, ప్రభుత్వ బళ్లను పటిష్ఠం చేయాలె. అంగన్వాడి టీచర్లకు మాంటిసోరి శిక్షణా, 2 షిఫ్టులలో బాలల కేంద్రాలు ఏర్పాటు చేయాలె. భాషా శిక్షణా కేంద్రాలను బడులకు అనుసంధానం చేయాలె. గ్రామీణ యువత, విద్యార్థులు, మహిళలకు భాషల్లో ఉచిత శిక్షణ ఏర్పాటుచేయాలె.

* పాఠ్యాంశాలలో స్థానిక జ్ఞానాలకు, చరిత్రకు, కళలకు, భాషా ప్రయోగాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలె. కొఠారి కమిషన్ ఇచ్చిన సూచనల ప్రకారం, స్థానిక వృత్తి నైపుణ్యాలను ప్రైమరీ స్థాయి నుంచే కర్రికులమ్‌లో భాగం చేయాలె.
* పాఠ్యపుస్తకాల్లో లింగ వివక్షతను ప్రతిఫలించే అంశాలను తొలగించాలె. స్త్రీలు తమ భాగస్వామిని తామే ఎన్నుకొనే స్వేచ్ఛను గౌరవించాలె. బాల్యవివాహాలపై  ప్రత్యేక నిఘా ఉండాలె. మాతమ్మ, జోగిని వంటి ఆచారాలను నిషేధించాలె.
* పాఠ్యాంశాలుగా, మార్పు కోసం పనిచేసిన స్థానిక రచయిత్రుల, కవయిత్రుల, మహిళా నాయకురాళ్ల జీవిత చరిత్రలను చేర్చాలె.
* గిరిజన భాషా సంస్కృతుల అధ్యయనాన్ని బళ్ళలో ప్రోత్సహించాలె.
* ప్రైమరి స్కూల్ నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు / ఉర్దూ భాషలను 'ఫస్ట్ లాంగ్వేజెస్' గా తప్పనిసరి చేయాలె.
* ప్రతి జిల్లాలో పిల్లల గ్రంథాలయం, కల్చర్ సెంటర్ విభాగం తప్పని సరిగా ఏర్పాటు చేయాలె. గ్రామీణ కళలకు పూర్తి ప్రోత్సాహం అందించాలె. నాటక, సినిమా రంగాలను ప్రోత్సహించే 'థియేటర్, ఫిలిం ఇన్‌స్టిట్యూట్' లను వెంటనే నెలకొల్పాలె. స్థానిక చిత్రకారుల ప్రసిద్ధ చిత్రాలను ప్రదర్శించే ఆర్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలె. లలిత కళా అకాడమీని పునరుద్ధరించాలె.
* తెలంగాణ ప్రాచీన సాంస్కృతిక, సామాజిక చారిత్రక సంపదలైన  తాళపత్ర గ్రంథాలు, లిఖిత పత్రాలు, ప్రాచీన గ్రంథాలు, శిల్పసంపద, కట్టడాలు, మౌఖిక సాహిత్యం, గ్రామీణ కళలు మొ. వాటిని రికార్డుచేసి ఆర్కైవ్స్ లో భద్రపరచాలె.
* చిన్న, గ్రామీణ పరిశ్రమల నైపుణ్యాలను నేర్పే శిక్షణా సంస్థలను ఉన్నత విద్యకు అనుసంధానం చేయాలె. చిన్న పరిశ్రమలను ప్రోత్సాహించాలె. అందుకోసం ప్రత్యేక కార్పోరేషన్లను ఏర్పాటు చేయాలె.
* ఉద్యోగినులకు రవాణా సౌకర్యాలను కల్పించే బాధ్యతను అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు తప్పనిసరి చేయాలె.
* స్థానికుల మనుగడకు ప్రాణాధారమైన నీళ్ళు, అడవులు, గుట్టలు ఇతర సమిష్టి సహజ సంపదలను 'వనరుల' స్థాయికి కుదించి వ్యాపార వస్తువుగా మార్చి ఇష్టం వచ్చినట్లు ధ్వంసం చేయడాన్ని అరికట్టాలె. Resources కాదు Life giving sources గా గుర్తించే స్థానిక ప్రజల అవగాహనలతో ప్రణాళికలు  రచించాలె.

* ప్రకృతి పరిరక్షణ ప్రణాళికల్లో స్త్రీల భాగస్వామ్యం ఉండాలె. గుట్టలపై పూర్తి హక్కు గ్రామ పంచాయతీలకు ఉండాలె. గ్రానైట్ ఎగుమతిని నిషేదించాలె. ఏ ఊరి రాయి ఆ ఊరికే అన్న నిబంధన పెట్టాలె. చెట్లను నరకడాన్ని తీవ్రంగా పరిగణించాలె.
* చెరువుల పరిరక్షణ, చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల, రక్షిత మంచినీటి పథకాలపై అజమాయిషీ మహిళా పంచాయతీలకు ఉండాలె. నల్గొండలో ఈ పథకాలను వెంటనే అమలుచేయాలె.
* స్థానిక ప్రకృతి పరిసరాలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా 'రాష్ట్ర భూ నిర్వహణ ప్రణాళికను' రూపొందించాలె.
* మహిళలకు భూమి హక్కు కల్పించే ప్రణాళికలను పక్కాగా అమలుచేయాలె.
* ఊరికొక లేడీ డాక్టర్‌నీ, అన్ని ఆధునిక సౌకర్యాలున్న ఉచిత 'బర్తింగ్ సెంటర్'ను ఏర్పాటు చేయాలె.
* వ్యవసాయ, ఆరోగ్య రంగాలలో స్థానిక సంస్థలకే అవకాశం కల్పించాలె. రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలె.
* ముల్కీ పరిశ్రమలను ప్రోత్సహించాలె, అందుకోసం పూర్వ నిజాం రాష్ట్రంలో చేసిన చట్టాలను పునరధ్యయనం చేయాలె.
* వ్యవసాయ విశ్వ విద్యాలయాల సంఖ్యను పెంచి వికేంద్రీకరించాలె.
* ఆహార భద్రత కాదు, ఆహార సార్వభౌమాధికారం సాధించాలె. స్వయం సమృద్ధి దిశగా ఉత్పత్తి, పంపిణి, నిర్వహణలను వికేంద్రీకరించాలె.
* వ్యవసాయం, నేత పరిశ్రమలకు పూర్తి ప్రోత్సాహం ఇవ్వాలె. మార్కెటింగ్ సౌకర్యాలు, రాయితీలు వెంటనే ప్రకటించాలె.
* వ్యవసాయం,చేనేత రంగాలలో సహకార నిర్మాణాలను ప్రోత్సహించాలె. వ్యవసాయరంగంలో మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలె. వ్యవసాయాన్ని కార్పోరేటీకరణ కాకుండా చూడాలె.
* తెలంగాణా విత్తన చట్టం తేవాలె.రాష్ట్రాన్ని ప్రకృతి సేద్య రాష్ట్రంగా తీర్చి దిద్దాలె.
* స్థానిక విత్తన బ్యాంకులను నెలకొల్పాలె. స్థానిక విత్తన పరిశోధనలను ప్రోత్సహించాలె.
* విత్తనాలపై ప్రైవేటు కంపెనీల జోక్యాన్ని రద్దుచేయాలె. విత్తన ఉత్పత్తి కేంద్రాల అజమాయిషీ స్త్రీ సంఘాలకు అప్పగించాలె.
* విద్యుత్ పొదుపు చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలె. ప్రత్యామ్నాయ జీవన శైలులపై ప్రసార మాధ్యమాల ద్వారా మధ్య తరగతి పట్టణ ప్రజలకి అవగాహన కల్గించాలె.
* విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణా పూర్తి రాయితీలు సాధించుకోవాలె.
* సౌర విద్యుత్ ప్రణాళికలను ప్రోత్సహించాలె.

* ఇంతవరకు నీటి వాటాలో తెలంగాణా నష్టపోయిన దానికి పరిహారం సాధించుకోవాలె. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆపేసి ప్రత్యామ్నాయ పద్ధతుల గురించి అన్వేషించాలె. ముంపు గ్రామాలపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరింపచేయాలె. నిర్వాసితత్వం మహిళలపై చూపే ప్రభావాన్ని తీవ్రంగా పరిగణించాలె.
* పాలనా వ్యవస్థల్లో అన్ని స్థాయిల్లో (దామాషా ప్రకారం) స్త్రీల భాగస్వామ్యాన్ని 50% వరకు పెంచాలె.

## పరిచయం :

సంగం లక్ష్మీబాయమ్మ గారు 27 జూలై 1911 సం.లో హైద్రాబాదు సమీప గ్రామమైన ఘటకేశ్వర్‌లో పుట్టిండ్రు. ఊపిరాడని ఆనాటి సాంఘీక వ్యవస్థ నుంచి బైటపడటానికి తనదే అయిన మార్గాన్నెంచుకున్న సాహసి ఆమె. చదువుకొని స్వంత వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవాలని నిర్ణయించుకొని ఇంట్లో చెప్పకుండా 1926సం.లో గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మలు స్థాపించిన శారదానికేతనములో అనాధగానే పేరు నమోదు చేసుకొని చదువు పూర్తి చేసిండ్రు. గాందీజీ అనుయాయిగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 సం.ల్లోనే జైలుకు వెళ్లిన తొలి విద్యావంతురాలు ఆమె. అంతేకాదు, నైజాం ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకించడంలోనూ,ఆపైన ఆచార్య వినోబా భావే గారితో కలిసి పాదయాత్రలో భూదానోద్యమం లోనూ పాల్గొన్న తొలితరం తెలంగాణ ఉద్యమకారిణి.

ఆ పాదయాత్రలో తనకెదురైన తెలంగాణ ప్రజల ఇక్కట్లూ, ముఖ్యంగా స్త్రీల అసహాయతకు కలత చెంది స్త్రీ సమస్యల పరిష్కారానికై 1952 సం.లో 'ఇందిరా సేవాసదనం' స్థాపించిండ్రు. (యాధృచ్ఛికమే అయినా ముక్త ఉమెన్స్ కలెక్టివ్ పురుడుపోసుకున్న ప్రాంతం ఇందిరాసేవా సదనం పరిధి లోనిదే).అతి సామాన్య కుటుంబంలో పుట్టి నాటి హైద్రాబాదు రాష్ట్ర విద్యాశాఖ ఉపమంత్రిగా, అటుపైన 15 సం.ల పాటు లోక్‌సభ సభ్యురాలిగా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారీమె. 1930 - 32 సం.లలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న కారణంగా అరెస్టు అయి 1933 వరకు రాయవేలూరు స్త్రీల జైలులో వున్నప్పటి ఆమె జ్ఞాపకాలు ఆమె స్వంత మాటల్లోనే.. సంక్షిప్తంగా...

# నా జైలు జ్ఞాపకాలు

***1930*** *సంగం లక్ష్మీబాయి*

అప్పుడు నాకు ఇరవై ఏళ్లు. జైలుకి తీసుకురాబడినపుడు అక్కడి జీవితం ఏ విధంగా ఉంటుందోనన్న ఆరాటంకాని, ఆలోచనకాని నన్నంటలేదు. ఈ జీవిత మెటువంటిదైనా, నా

దేశంకోసం,నా పరిధిలో నేనూ కొంత చేయగలిగాననే తృప్తి, ఇంకా ఏదో చేయాలనే తపనా నన్ను పూర్తిగా ఆక్రమించుకున్నాయి. నేనీ ప్రపంచంలో నిరాశ్రయురాలినైన ఒక పథగామినిని. నా దారిలో నేను నా శక్తికొద్దీ నలుగురికి ప్రయోజన కారిణిని కాగలుగుతే అంతకంటే వాంఛింప తగిన దేముంటుంది?

ఈ విధమైన సంతృప్తితో జైలు గోడల మధ్యకి చేరుకున్న నాకు ఎదురు చూడని అదృష్టం తోడైంది. అంతవరకు నా బోటి వ్యక్తి కేవలం వార్తా పత్రికలలో తప్ప, వ్యక్తిగతంగా కలుసుకొని సన్నిహితంగా మెలగి, ముఖా ముఖి సంభాషించగల అవకాశమే ఊహించలేని ఎందరో హేమా హేమీలైన నాయకులు అంతకుముందే అక్కడికి వచ్చి చేరటం; వాళ్ళతోనే నేను కలిసి జీవించబోతున్నానన్న సత్యం నా కద్భుతంగా, అత్యానందకరంగా తోచింది. నా మనసు పౌర్ణమినాటి సముద్రంలాగా పొంగింది.

జైలులో ఎ,బి,సి క్లాసులని తరగతుల వారీగా రాజకీయ నేరస్థులకు శిక్షలు విధించేవారు. ఎ, బి క్లాసువారి గదులు ఒకటే బారక్స్‌లో ఉండేవి. వారికివంటా, వార్పూ కూడా ఒకటే చోట జరిగేది. సి క్లాసు మాత్రం ఎ,బి క్లాసు వారికి కొంత దూరంలో వేరే బారక్స్‌లో ఉండేది. ఈ క్లాసులో లెక్కకు మించిన రాజకీయ ఖైదీలుండేవారు. ఎ, బి క్లాసు వారికి సి క్లాసు వారికంటె కొన్ని అదనపు సౌకర్యాలుండేవి. ఉదాహరణకు సి క్లాసు వారికి వారి ఆత్మీయులకి నెలకి ఒక ఉత్తరం కాని, లేదా ఒక ఇంటర్వ్యూ కాని అనుమతించబడితే, ఎ, బి క్లాసుల వారికి నెలకి ఒక ఉత్తరమూ, ఇంటర్వ్యూ రెండూ అనుమతింపబడేవి. సి క్లాసు వారి వంటశాల కూడా వేరుగా ఉ ఒండేది. మనిషి ఉన్నా ఇంతమందికి ఒక్కరి వల్లకాదు కనుక మాలో మేము గ్రూపులుగా విభజింపబడి ఒక్కొక్క గ్రూపు ఒక్కొక్క రోజు వంటా వార్పులతో పాటు మరింకా కొన్ని విధులను నిర్వర్తించే వారము. మధ్యాహ్నం భోజనానికి ముందు రుక్మిణీ లక్ష్మీపతి దగ్గర ఇంగ్లీషు పాఠం సాగేది ఖైదీలకు. భోజనమయాక దుర్గాబాయి హిందీ పాఠం చెప్పేవారు. నేను కూడా కొందరికి హిందీ చెప్పేదానిని. జైలు అధికారులు నియమించిన కుట్టు టీచరు కుట్టు చెప్పేది మాకు. ఆవిడ పేరు పున్నమ్మ. మేమంతా ఆమెను కుట్టు పున్నమ్మ అని పిలిచేవాళ్లము. సాయంకాలం ఆటల పాటల సందడి.ఆటలుకూడా జైలు అధికారులు మాకోసం ఏర్పాటు చేసిన బాట్‌మెంటన్ వంటి ఆటలు ఆడేవాళ్ళం. అప్పుడప్పుడు పరుగు పందాలు పెట్టుకునే వాళ్ళం. స్కిప్పింగు ఆడేవాళ్ళం. నాలుగు స్తంభాలాట ఆడుతూ మా అరుపులతో జైలుని హోరెత్తించేవాళ్ళం.

మా కార్యక్రమాలు ఎంత నియమబద్ధంగా ఉండేవో అంత నియమ రహితంగా జైలులో మేము అల్లరి చేసేవాళ్ళం. మా ధ్యేయమల్లా ఒకటే. జైలు అధికారులు కూడా పరపాలకులే. పరపాలన మాకు అంగీకారం కాదు, కనుక వాళ్ళని ఏడిపించటం మా లక్ష్యం.అందుకని మేము ఎన్నో మార్గాలు వెతికే వాళ్ళం. రోజుకొక అల్లరి. రోజుకొక గోల,జైలు అధికారుల నిద్ర చెడగొట్టేవాళ్ళం. వాళ్ళని స్థిమితంగా ఉండనిచ్చే వాళ్ళంకాదు.ఈ అల్లరి వెనుక ఎప్పుడూ దుర్గాబాయి

ఆలోచన ఎక్కువ. రోజు కొక కొత్త పద్ధతిలో జైలు అధికారుల నేడిపించటంలో ఆమె సిద్ధహస్తురాలు.

జైలు అధికారుల నేడిపించటం ఒక సరదా. ఈ సరదా ఒక్కటే కాక మాకు జైల్లో కూడా పూజలు, పునస్కారాలు, సీమంతాలు, పేరంటాలు, వీడ్కోలు విందులు, స్వాగత సన్మానాలు – ఇత్యాది ముచ్చట్లెన్నో ఉండేవి.

సుబ్బమ్మగారి తర్వాత ఇంకా కొందరు వ్యక్తిగతంగా జైలు అధికారుల్ని ఏడిపిస్తూ ఉండేవారు. వీరందరికి మధ్య నేను కూడా తక్కువ తినలేదు.రాత్రులు నాకు త్వరగా నిద్ర పట్టేది కాదు. నాకు నా జీవిత సమస్యలనేకం. వయసేమో చిన్నది. తల్లిదండ్రులు, ఆత్మీయుల ప్రేమ కర్రులు చాచే ఆశ్రయ భావం మనసులో అపరిమితంగా ప్రకటితమయే లేబ్రాయము. ఆ వయసులో విధి నన్నన్నిటికీ దూరంచేసి వేసింది. లేని తల్లి లేనేలేదు. పోయిన భర్త పోనే పోయాడు. ఉన్న తండ్రి దూరమై పోయాడు. నాకింకెవరు? ఎవరికి కావాలి నేను? లోలోపల హృదయాంతరాళాలలోని ఈ ఆక్రోశం రాత్రులు నిద్రకి దూరం చేసేది నన్ను. అటువంటప్పుడు ఏదైనా పుస్తకం చదివితే మనసుకి కొంత ఉపశమనం కలుగుతుంది. కాని రాత్రులు దీపాలుండవు కదా జైలులో. ఎట్లాగైనా దీపం తెప్పించుకునే నెపంతో 'తేలు! తేలు! తేలు కుట్టింది బాబోయ్' అని కేకలు పెట్టేదాన్ని.

వార్డెను లాంతరు తీసుకుని పరుగు పరుగున వచ్చి 'ఎక్కడ? ఎక్కడ తేలు? అని ఆదుర్ధగా అడుగుతుంటే 'అదుగో అటు! ఇదుగో! ఇటు! ఇటు వచ్చింది. అరె! అదుగో అటు పరుగెత్తుతోంది' అంటూ వార్డెనుని ఆమె డాన్సుకి ఆమెను వదిలేసి లాంతరు తీసుకొని చల్లగా జారుకునే దానిని.

మళ్ళీ ఏ తేలుకో, పాముకో భయపడి వార్డెను లాంతరు అక్కడే ఒదిలేసి వెళ్లేది. నేను హాయిగా చదువుకునే దానిని. అంతటితో ఆగేదా? ఆ మర్నాడు, ఆతర్వాత కొద్ది రోజులు వార్డెనుని చేయించిన డాన్సు గురించి మిత్రురాండ్రతో ముచ్చటించి ఉల్లాసంగా నవ్వుకునే వాళ్ళం.

# నా జైలు జ్ఞాపకం

***1950*** *కా।। రంగమ్మ*

సంస్కరణ వాద ధోరణులను దాటి జాతీయ వాద పరిమితులను అధిగమించి ముందుకు సాగిన తెలంగాణా స్త్రీల సామాజిక, రాజకీయ చైతన్యానికి సాయుధ పోరాట కాలమే సాక్ష్యం. మధ్యతరగతి మహిళల సామాజిక అవగాహనలకు శ్రామిక దళిత బహుజన ఆదివాసీ స్త్రీల రాజకీయ చైతన్యం తోడై సమానత్వ సాధనలో తెలంగాణా స్త్రీలందరు ఒక్కటిగా ఉవ్వెత్తున ఉ

ద్యమాల్లోకి దూకిన తొలి సందర్భమదే. సాయుధ పోరులో పాల్గొన్న చైతన్యం వాళ్ళను ప్రజాస్వామిక ఆకాంక్షలను సాధించుకునే శక్తులుగా మలిచింది. పురుషాధిక్యత, రాజకీయ నిస్తేజం వంటి పలు కారణాల వల్ల పోరాట విరమణ తరువాత ఆ స్త్రీలు చాలామంది తిరిగి వంటిళ్లలోకి నెట్టబడిన సందర్భాల గురించీ, వారి అనుభవాల గురించి "మనకు తెలియని మన చరిత్ర" అన్న పుస్తకం వివరించింది. కొంతమంది ఉద్యమకారిణిలు మాత్రం నిరంతర సంఘర్షణలల్లోంచే అయినా స్త్రీ, పురుష సమానాత్వన్ని తమ అచరణ ద్వారా సాధించుకునే దిశగా అడుగులు ముందుకే వేశారు. అలాంటి వారిలో జీవించి ఉన్న మల్లు స్వరాజ్యం వంటి వారి తరానికి చెందిన ఉద్యమకారిణి రంగమ్మ. నల్గొండ జిల్లా పెంచికలపాడులో పుట్టిన ఆమె సాయుధ పోరాటం తరువాత సమసమాజ పోరాట ప్రస్థానంలో పాలమూరు జిల్లాను తన కార్యక్షేత్రంగా ఎంచుకున్నరు. నల్లమల అడవుల్లోని అమ్రాబాద్ ప్రాంతంలో ప్రజలతో మమేకమై దళంలో పనిచేసిన ఆమె, ఆధిపత్యవాదులను కంటిమీద కునుకులేకుండా చేసింది. ఆమె పేరు చెబితేనే ఉలిక్కిపడే సందర్భమది. ఎన్నో ప్రయాసలతో ఆమెను చివరికి పోలీసులు అరెస్టు చేసి జైలుకి తీసుకెళ్ళినప్పుడు వందల కొద్ది జనం ఆమెను చూసేందుకు బారులు తీరారట! 2003 సం॥లో అమెను తొలిసారి కలుసుకొని ఇంటర్వ్యూ చేసిన సందర్భంలో జైలులో అప్పటి తన అనుభవాలను మాతో పంచుకున్నరు. ఆమె వివరించిన ఆనాటి ఓ అనుభవాన్ని ఆమె మాటల్లోనే ....

పోలీసులు ఆరోజులల్ల నాపేరు చెబితేనే గడగడ వణికిపోయే వాళ్ళు. ఎన్నో తిప్పలుబడి చివరికి నన్ను అరెస్టు చేసింద్రు. జైల్ల వున్న నన్ను చూసేందుకు జనం బారులు తీరింద్రు. జైల్లో నన్ను ఆడవాళ్ల సెల్‌లనే వుంచింద్రు. అక్కడ రకరకాల నేరస్తులు వుండేటోల్లు. నేనొక్కదాన్నే రాజకీయ ఖైదినైనా నన్ను వాళ్లందరితోన కలిపి వుంచింద్రు. చిన్న చిన్న అర్రలల్ల ఇరుకిరుకుగా వుండేటోల్లం. స్నానానికి, బట్టలు ఉతుక్కోడానికి నీళ్ళు ఇవ్వక జైలు సిబ్బంది మమ్ములను తిప్పలు పెట్టేవాళ్ళు.

నెలనలా మా బట్టలను ఉతుక్కోవడం కోసం నానా తిప్పలు పడేటోల్లం. నీళ్ళు సరిగా లేక సబ్బులు లేక మా బట్టలు ఓ రకం మదం వాసనతో వుండేటియి. ఎన్నిసార్లు జైలరును సబ్బులు,బ్రష్షులు కావాలని అడిగినా పట్టిచ్చుకోలే. చూసినా చూసినా ఇంగిట్ల లాభం లేదని అర్థమైంది. అప్పుడు నాకో ఆలోచన వచ్చింది. అందర్ని కూసోబెట్టి నా ఆలోచన చెప్పిన. ఒక సెల్‌ల్లో చాలామందిమి ఉండేటోల్లం గదా – మాకందరికీ ఇంచుమించుగా ఒక్కసారే ఎర్రబట్ట అయ్యేది.నా ఆలోచన జెప్పి అందర్ని ఒప్పిచ్చిన. ముట్టయిన వాళ్ళందరం తొల్తరోజు కూడబలుక్కున్నం. మల్తరోజు అందరం రక్త వోడి, వాసన కొడ్తున్న మా మైల బట్టల్ని పట్టుకోని జైల్ల ఉరేగింపు తీసినం. అందరి కంటే ముందు నేను జెండావలె మైల బట్టపట్టుకోని నడుస్తుంటే నా వెనుక అందరు బారులు తీరి బట్టలు ఎత్తి పట్టుకొని నడవడం మొదలు వెట్టింద్రు. ఇంక

చూస్కో, మమ్మల్ని మా చేతుల బట్టల్ని చూసి పోలీసులు జడుసుకున్నరు. ఉరికిపోయి మొగాలు దాసుకున్నరు. జైలరు అ(ర వరకు నడిచేలోపుగా అంతా అల్లకల్లోలమైంది. మేం వెళ్లకముందే జైలరుకు విషయం తెలిసి తలపట్టుకుని కూలబడిండంట – సబ్బులు అడిగినా ఇవ్వని తన సిబ్బందిని చడామడా తిడ్తున్నడు. మేం పోయేసరికి మొగం దాసుకొని దండం బెట్టి "అమ్మా – తప్పయింది – దయచేసి వెళ్లిపోండి. ఇప్పుడే మీరడిగినవన్నీ ఏర్పాటు చేస్తం" అని ఒక్కటే దండం బెట్టుడు. "దండాలు తర్వాత గాని ముందుగాల పని చూడు" అనంగానే ఉరుకుతున్న జైలరును జూసి అడోళ్లందరం నగుకుంట స్నానాలకు పోయినం. ఇదీ అప్పటి మా ధైర్యం.

# వంటిల్లు వదలండి – వీధుల్లోకి రండి

**(ఉద్యమం:నా అనుభవాలు – జ్ఞాపకాలు)**

***1969*** ***డా. తిరునగరి దేవకీదేవి***

నా కదో సంధి కాలం. పి.యు.సి. (ప్రి యునివర్సిటి కోర్సు) పూర్తి చేసిన కాలం. ఇంటికి ఆలంబనగా హోమ్ ట్యూషన్స్ చెప్తున్న రోజులవి. ఉన్నట్టుండి ఓ రోజున ట్యూషన్ నుండి ఇంటికి వస్తూ వస్తూ దారిలో నా స్నేహితురాలు 'ఉమ' వాళ్లింటికి పోయిన. సాయంత్రం అయిదు అయిందనుకుంట. అది 1969 ఏప్రిల్ మొదటివారం. ఉమ నాకు ఓ ఉద్యమసమాచారాన్నిచ్చింది. తను లష్కర్ బజార్ ఆడపిల్లల స్కూల్లో చదువుతుండె. ఉమావాళ్ల స్కూల్ పిల్లలతో పాటు అన్ని స్కూళ్ల పిల్లలందరూ కలిసి హన్మకొండ నుండి కాజీపేట వరకు ఉద్యమించిన తీరును ఉత్సాహంగా చెప్పుకొచ్చింది. ఇగ నా మనసాగలే. మొత్తం విషయాన్ని ఆరా తీసిన. ఆంధ్రోల్లందరు మన ఉద్యోగాలను, నీళ్లను, నిధులను పట్టపగటి దొంగలోలె దోసుకొంటున్నందుకు అస్తిత్వంకోసం ఉద్యమం మొదలైందని తెలుసుకున్న. అప్పటికింక పేపర్లల్ల ఈ విషయాలు పెద్దగారాలె. ఇగ నాపానమాగలే. తెల్లారిన కాడినుంచి ఆ ఉద్యమంలో కలిసిపోయిన. పింగిల్ వుమెన్స్ కాలేజి మొదలుకొని మచిలీబజార్ స్కూల్‌వరకు అందరు ఆడపిల్లలేకమైన్రు. విమెన్స్ కాలేజి ప్రెసిడెంట్ లీల, లష్కర్ బజార్ హైస్కూల్ జయ, ఇంకా విజయ, జయ, అరుణ, రజిత, ఉమ, తార, శకుంతల మా చెల్లె కృష్ణకుమారి.... అందరం ప్రతిరోజు కూడబలుక్కొని, వాడపక్కలున్న దోస్తులను కలుపుకొని చౌరస్తాకు దౌడే దౌడు. మొదటి వారం రోజులు రకరకాల కచ్చీర్లు తిరిగి పికెటింగ్‌లు చేసినం. గదే.. కచ్చీర్లు పన్జేయకుంట,ఉద్యోగస్తులను లోపలికి పోనియ్యలే. 15 ఏప్రిల్ 1969న పెద్ద జులూస్ బయలుదేరింది. ఆ జులూస్ వెయ్యిస్తంబాల గుడి చేరుకుంది. గుడికి ఒక ప్రక్కనున్న చెట్టుకింద

చుట్టుపక్కల అందరూ కూచున్నరు. నాయకులంతా ఒక్కొక్కరూ పోయి ఉద్యమ ఆవశ్యకతను వివరించిన్రు. ఆంధ్రోళ్ళ పెత్తనాన్ని, దుర్మార్గాన్ని, దోపిడీని దుయ్యబట్టిన్రు. నా మెదడూ మనసు కదిలినై. ఇగూరుకుంటన? అందర్ని తోసుకుంట ముంగరికి పోయిన "కొంగు నడుముకు సుట్టవే సెల్లమ్మ..... లేవాల్ల" నా ఓణిని ఓ పక్కకు సెక్కి "మన ఆడోల్లమందరం ఏకమై శత్రువులకు సెమటలు పట్టిచ్చిన రుద్రమ లెక్క ఆంధ్రోల్ల కాల్లకు బుద్ధి చెప్పించాలె. మన ఉద్యోగాలు మనం కాపాడుకోవాలె. మన ఒనరులు మనం కాపాడుకోవాలె. మన భూములు మనం కాపాడుకోవాలె. మొత్తం మీద మన హక్కులు మనం కాపాడుకోవాలె" అంటూ ఆవేశంగ మాట్లాడిన. పబ్లిక్ మీటింగ్‌ల మాట్లాడుడు గదే ఫస్ట్.

గటెంక గూడంగ మస్తు జులూస్‌లు తీసిన్రు. రిలే నిరాహార దీక్షలు షురువైనయ్. మేం మా వంతు బాధ్యతగా, లష్కర్ బజార్ గర్ల్స్ హైస్కూల్ ముంగట టెంటేసుకున్నం. గప్పటి దీక్షలకు ఇప్పటి వాటికి మస్తు ఫరకున్నది. ఇప్పుడైతే పొద్దుగాల అన్నందిని తొమ్మిది,పది గంటలకు దీక్షల కూసోని అంబటాలకల్ల నిమ్మరసం, స్ప్రైట్‌లు తాగి దీక్ష విరమిస్తున్నరు. గప్పుడట్లలే. ఇయ్యాల పొద్దున దీక్షల కూకుంటే రేపొద్దున 9 గం.లకు దీక్ష విరమణ అంటే పక్కా చౌబీస్ గంటే.

అటెంక మస్తు పికెటింగ్‌లు. పోలీసులు చెదర గొట్టుడు, ఉరుకుడు అరెస్టు. లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, ఫైరింగ్‌లు, 144 సెక్షన్లు, కర్ఫ్యూలు. కర్ఫ్యూల కారణంగా జనం నిత్యావసరాలకు మస్తు తిప్పలైతుండె. అత్యవసరంగ బజార్లకొచ్చిన జనాన్ని పోలీసులు ఉరికిచ్చి, ఉరికిచ్చి కొడుతుండ్రి.పరేషాన్ల పబ్లిక్ సందులు గొందులల్ల పడి, గోడలు దునికి తప్పించుకుంటుండిరి. గా కోశీష్‌ల కొన్ని సార్లు గాయాలు తప్పకుండె. కర్ఫ్యూల 365 మంది పానాలు పోయిన ముచ్చట ప్రపంచెం కోడై కూస్తనే ఉండె. అయితే గప్పుడు సి.ఎం. బ్రహ్మానందరెడ్డి సెంట్రల్ పోలీసు బలగాన్ని తెప్పించిండు. వాళ్ళు ఇనుప టోపీలు పెట్టుకుంటుండిరి. మేమైతే "చిప్ప పోలీస్ డౌన్ డౌన్ " అని లొల్లిపెడుతుంటిమి. మన స్థానిక పోలీసులు ఇప్పటంత దౌర్జన్యంగ ఉండకుండిరి. ఆగమంత చేసింది సెంట్రల్ పోలీసులు, వాళ్ళ అధికారమే. ఇక్కడ అసలు రహస్యమేమంటే అప్పుడు గింతమంది ఆంధ్రపోలీసు అధికారుల పెత్తనం లేకుండెనన్నట్లు. ఒకసారి మా జులూస్‌కు (ఆడోల్లు) పర్మిషన్ ఇచ్చిన్రు. కానీ తెల్లారి కర్ఫ్యూ ఆర్డరు వచ్చింది. అయినా పర్మిషనున్నందుకు మా జులూస్‌ను పోలీసులు అడ్డగించలే. ఆంధ్ర పాలకుల, ఆంధ్ర పోలీసుల కుటిల కుతంత్రాల కారణంగా ఇప్పటి మలితరం ఉద్యమంలో ఎంత హింస చెలరేగింది? ఎందరు అక్రమంగా అరెస్టయినారు. ఎన్ని అక్రమ కేసులు వారిపై బదలాయించారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంట. ఆ దినాలల్ల ఆడి పిల్లల మందరం కల్వడానికే

మస్తు తిప్పలైతుండె. ఇల్లిల్లు తిరిగి మా దోస్తులందర్ని జమచేసుకొని రావల్సి వస్తుండె. ఇప్పటిలెక్క హాస్టల్లు లేవు. ఉన్న హాస్టలల్ల గింతమంది ఆడపిల్లలు సదువకుండిరి. స్వచ్ఛందంగా కుటుంబసభ్యులు వాళ్ళ పిలల్లను ప్రోత్సహిస్తుండిరి.

మేమైతే మా కార్యక్రమాలల్ల భాగంగ రాస్తారోకోలు మస్తుగ చేసినం. ప్రజల్లోకి ఉద్యమ ఆవశ్యకత చొచ్చుకపోవడానికే కద. గీ కతలన్ని ప్రభుత్వంపై ఒత్తిడికి పనికొచ్చేమాట మనకు తెలిసిందేకద. అయితే గీ రాస్తారోకోలెక్కువ హన్మకొండ చౌరస్తాల జరుగుతుండె. అప్పుడప్పుడు రాగన్న దర్వాజకాడ. ఒకసారి వరంగల్ పోస్టాఫీస్ కాడ గూడంగ చేసినం. ఓ గంట/అరగంట అయినంక పోలీసుల జీపులొచ్చి అరెస్టు చేసి ఠానాలకు తోలుకపోతుంఁడ్రి. అరెస్టులు,కత, ఖార్ఖానా రాసుకున్నంక కోర్టుకు హాజరు పరుస్తుండ్రి. రెండు మూడుసార్లు తిప్పిచ్చుకొని బెయిలిస్తుండ్రి. తెంపా కుచ్చా తెల్లారెనన్నట్లు గిదంత యాస్టకొస్తుండె. ఓపారి మా పోరలనందర్ని జడ్జి ముంగట నిలబెట్టంగనే గాయన జైలుకు పోతరా అని అడిగె. తెలంగాణ అంటే పానాలర్పించడానికె సిద్దమైనోల్లం జైలుకు రెడీ అంటిమి. రాజమండ్రి జైలుకా, వరంగల్ జైలుకా అని మల్లో ప్రశ్న అడిగె. ఆంధ్రజైలుకు మేమెందుకు పోవాలె? అని మా స్వాభిమానాన్ని చాటుకున్నం.అగో మీ కిష్టమైన జైలుకు మేమెందుకు పంపిస్తమని జడ్జి ఉల్టా ప్రశ్నించిండు. గిది బాగానే ఉంది. మీరడిగితేనే కదా మేం జెప్తిమని గట్టిగన్న నేను. జడ్డి, లాయర్లు బిత్తర పోయిన్రు. పిల్ల పిడుగున్నదనుకున్రు. గీ పిల్ల లాయరైతే జబర్దస్తుగుంటదని ఓ లాయరన్నడు. మొత్తంమీద గా రోజు వరంగల్ జైలు గోడల్ని సూసినం. ఆ సిప్పలల్ల జైలుకూడు లోపలికి పోలె. నిద్రపట్టలే. నిరాహారానికి జాగారం జతైంది.

ఇక్కడో మరో ముచ్చట యాదికొస్తాంది. ఉద్యమం జైల్ భరో కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వేలాదిగా విద్యార్థులు కదిలివచ్చిన్రు. జైళ్ళు భర్తీ అయినయి.మిగిలిన ఉద్యమకారులనెక్కడ పెట్టాల్నోనని పరేషానైంది సర్కార్. విద్యాలయాలన్నీ కృష్ణజన్మస్థానాలైనయ్. ఉద్యమం ప్రభుత్వ సామర్థ్యాన్ని ప్రశ్నించింది. ఆర్థికంగా కూడా ప్రభుత్వానికి సవాలైకూసున్నది. రోడ్లన్ని యుద్ధం ముందట ప్రశాంత వాతావరణాన్ని గుర్తు చేస్తుండె. 144 సెక్షన్‌లు, కర్ఫ్యూలు ఉద్యమం ముందు పనికిరాకుండా పోయినై. ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ లక్ష్యంగా అన్ని నిర్బంధాలను అధిగమిస్తూ ముందుకు పోతున్న సందర్భంగా ఖాకీల క్రౌర్యం 369 మందిని పొట్టనపెట్టుకున్నది.

ఒకసారి చౌరస్తాలో ఆడిపిల్లలమందరం సడక్‌మీద బైఠాయించినం. పోలీసులు అట్‌కాయించిన్రు. వాళ్ళ ప్రవర్తన ఆవేశాన్ని తెప్పించింది. తార అనే అమ్మాయి చెప్పుతీసింది. అందరం అదే మార్గాన్ని అనుసరించాం. నేనూ ఆ పనే చేసిన. మొత్తం మీద ఎస్.ఐకి చెమటలు

పట్టించినం. కాకపోతే ఆ మరుసటి రోజునుంచి తార ఉద్యమంవైపు కన్నెత్తి చూడలేదు. మరోరోజు రాగన్న దర్వాజ దగ్గర (ఏనుగుల గడ్డ) చాలామందితో రాస్తా రోకో చేస్తున్నం. రాస్తాను ఖాళీ చెయ్యమని పోలీసుల గద్దింపు. జైల్లో వేస్తామని హెచ్చరికలు. వాళ్ళ గద్దింపులు హెచ్చరికలు మమ్మల్ని యించుమందం కదల్చలేకపోయినై. పోలీసులు మమ్మల్ని జీపులో ఎక్కించే ప్రయత్నంలో మమ్మల్ని మోస్తూ జీపులోకి ఎక్కించడానికి నావద్దకు వచ్చారు. నాకావేశం ఆగలేదు. పోలీసు కాలరు పట్టుకున్నాను. లాఠీని లాగుతూ కలియబడ్డాను. లాఠీకూడా విరిగింది. ఉద్యమకారులకన్నా పోలీసుల బలగం ఎక్కువ. పదిమంది కలెబడి జీపులో ఎక్కించిన్రు. పోలీసు ఠానా – కోర్టు – బెయిలు – షరా మామూలె.

అదే సాయంత్రం. మల్టీ పర్పస్ గ్రౌండ్‌లో పెద్ద బహిరంగ సభ. మస్తు మంది నాయకులు మాట్లాడిన్రు. చీఫ్ మినిస్టరుకు వ్యక్తిత్వం లేదు. సొంత నిర్ణయాలు లేనే లేవు. (గోసూడినా పెట్టుకోవాల్నా వద్దా అని కేంద్రంపై ఆధారపడుతరని ఎగతాలింపు) సంగెం సత్యనారాయణ " రావోయి రావోయి రామ్‌సెంద్రారెడ్డంటూ" పాట ఎత్తుకున్నడు. (ఆ రోజుల్లో కళాకారుల సంఖ్య తక్కువే) ఉదయం జరిగిన సంఘటనలు ఒక్కటొక్కటి యాదికొచ్చినై, ఆవేశంతన్నుకొచ్చింది. వేదికనెక్కే నావంతొచ్చింది. దబ్బ దబ్బ పోయి స్టేజెక్కిన. ఆడపిల్లలను మొగపోలీసులు భౌతికంగా పట్టుకొని జీపులెక్కించడమేందనే ఉక్రోషంతో ఉన్నాను. లా అండ్ ఆర్డర్ మేయిన్‌టేన్ చేయడానికి అరెస్టు చేస్తున్నామని చెప్పుకొచ్చే రక్షకభటులు లా పాటించక పోవడమేంటని ప్రశ్నించిన. వేలాది మంది సెంట్రల్ పోలీసులను (సి.ఆర్.పి) తెప్పించిన ప్రభుత్వం లేడీ పోలీసునెందుకు ఉపయోగించుకోలేక పోయిందని ప్రశ్నించిన. అమ్మాయిల్ని అరెస్టు చేసి తీరాలనుకున్న మగ పోలీసులు కనీసం చీరలైనా కట్టుకురావలసిందని ఆక్రోశించి నాలుక్కరచుకున్నాను. (చీరలుకట్టుకున్న వాళ్ళేమైనా తక్కువా? అనే ఉద్దేశంతో, అయినా అప్పటికి ఫెమినిజం అంతగా వంటబట్టలేదనుకోండ్రి) కాస్తా ఘాటుగానే తీవ్ర పదజాలంతో తిట్టాను. ఎంత ఘాటైన పదజాలమంటే జనమంతా నన్ను పి.డి.ఆక్ట్ కింద అరెస్టు చేస్తారనుకునేంత. ఆ మరునాడు నా శ్రేయోభిలాశులు ఇంటికి క్యూ కట్టినట్లేవచ్చి కొన్ని రోజులు ఊరొదిలిపొమ్మని సలహా. అందుకు నేను భయపడక పోయినా మా పెద్దవాళ్ళు మాత్రం వెంటనే మా మేనమామ ఊరికి పంపించిన్రు. ఓవారం రోజులపాటుండి హన్మకొండ తిరుగుముఖం పట్టిన.

ఉద్యమ కాలంలో పోస్ట్‌పోన్ అవుతూ వచ్చిన పదవతరగతి పరీక్ష తేది వచ్చింది. పరీక్షలు మొదలుకానే అయినయ్. తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకునే 95% మంది పరీక్షలకు దూరంగా ఉన్నారు. మిగిలిన 5% స్వార్థంతో సంకుచితబుద్ధితో పరీక్షలకు రెడీ అయిన్రు. ఫాతిమా బాలికల పాఠశాల (ఇంగ్లీషు మీడియం) సెయింట్ గాబ్రెల్స్ యాజమాన్యం అవసరానికి

మించిన పోలీసు బలగాలతో పరీక్షలు రాయించడానికి పూనుకొన్నది. మిగిలిన కేంద్రాలలో ఉద్యమం పరీక్షలనడ్డుకొన్నది. మేమైతే ఒక జీపులో బయలుదేరి స్కూళ్లముందర కాపలాకాస్తున్న పోలీసుల ఊహకందనంత వేగంగా ఆ స్కూళ్ళో చొరబడి హాల్లోకి పోయి పరీక్షలు రాస్తున్న విద్యార్థులనుంచి ప్రశ్నా పత్రం, జవాబు పత్రాలు గుంజుకుని చింపిపారేసి వచ్చినం. పోలీసులు మమ్మల్ని చేరుకునేలోపే యమస్పీడుగా మా పనిని పూర్తి చేసినం. నేనైతే అవసరమైనప్పుడు ఊపయోగించుకోడానికి కారంపొడి పొట్లాన్ని దగ్గిర పెట్టుకునేదాన్ని. దాన్నుపయోగించాల్సిన అవసరం రాలేదు.

ఉద్యమం, దాని లక్ష్యం జనాన్ని స్వచ్ఛందంగా స్పందించి పాల్గొనేంతగా సన్నద్ధం చేసింది. కొన్ని మీటింగ్స్‌ల్లో నేనొక్కదాన్నే మహిళని. ఈ ఉద్యమంలోనే మహిళా సదస్సుకై తేదీ ఖాయమైంది. అందుకుగాను కరపత్రం విడుదలైంది. 'వంటిల్లు వదలండి, వీధుల్లోకి రండని' కరపత్రం కాప్షన్. సదారక్ష్మి, ఈశ్వరీబాయిలు ముఖ్య అతిధులు. సులోచనా నరోత్తమ్‌ని ఆహ్వానించినప్పటికీ పరిస్థితులను అనుకూలించడంలేదని రాలేదు. వేలాదిగా ఆడా, మగా అంతా తరలి వచ్చిను. 18 సం. దేవికీ దేవి ఆ సభకు అధ్యక్షత వహించింది.

ఉద్యమంలో విద్యార్థులు నాయకులే కాదు. ఉద్యమంలో ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లూ కలిసిపోయారు. రాష్ట్రమే ధ్యేయంగా జీతబత్యాలను లెక్కచేయలేదు.

ఇన్ని విధాలుగా సాగిన ఉద్యమం సొంతం రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లోకి జారుకుంది. ఎన్నికలే ధ్యేయంగా ముందుకు సాగింది. ఆ పార్టీని గెలిపించేందుకు విద్యార్థులు, ప్రజలు కంకణం కట్టుకున్నారు. గ్రామాల్లో,పట్టణాల్లో మీటింగ్‌లే మీటింగ్‌లు. జనం కుప్పలు తెప్పలుగా వచ్చేవాళ్ళు. తెలంగాణాను కోరుకునే ప్రజలపార్టీ తెలంగాణ ప్రజాసమితిగా ఆవిర్భవించింది. పార్టీగుర్తు పార. ఇతర నాయకులు, విద్యార్థులతో పాటు నేనూ గ్రామాలు తిరిగిన, జనగాం, పరకాల వంటి గ్రామాలకూ పోయిన. రాత్రనక, పగలనక తిరిగిన. అంతటి ఉద్యమంలో ఎలాంటి అపశ్రుతులు జరిగిన సందర్భాలు లేవనే చెప్పాలి పోలీసులనుండి.మలితరం మన ప్రస్తుతం చూసిన ఉద్యమాల్లో రక్షక భటులే భక్షక భటులయ్యారనే సత్యం మనందరికీ తెలిసిందే కదా.

ఓట్లు దగ్గిర పడుతున్న కొద్దీ ఇల్లిల్లూ తిరిగినం. ప్రజాసమితినెందుకు గెలిపించుకోవాలో వివరించినం. కొందరితో చీవాట్లు తప్పలేదు. ఇంటింటి ప్రచారంలో మా పిలుపు వింటూ బయటికి వచ్చే ఇల్లాండ్రు చేతిలో బిక్షంతో వచ్చేవాళ్ళు. ఆ రోజుల్లో ఇప్పుడున్న ఆర్భాటాలు లేవు. జనం ఇప్పుడు ఇంటింటికి కదిలినంతగా అప్పుడు కదలలేదు. ఆ యిల్లాండ్లకు "అమ్మా తెలంగాణ రాష్ట్ర సాధనకై ఓటు బిచ్చగాండ్లమని" చెప్పుకునేవాళ్ళం. ఏమైతేనేం 14 పార్లమెంట్ సీట్లకుగాను

పదకొండింటినీ గెలుచుకున్నాం. వరంగల్ నియోజకవర్గంలో ఎస్.బి.గిరి గెలిచిండ్రు. ఇంతా చేస్తే నాయకులు మా ఉద్యమకారులను పట్టించుకొన్నది లేదు, కలిసిందీ లేదు. ప్రజా విద్రోహానికి పాల్పడుతూ ఎస్.బి.గిరి కాంగ్రెసు పార్టీలో చేరిండు. హార్ట్ఎటాక్ వచ్చి పరలోకయానం చేసి ఏ పార్టీకి కొరగాకుండా పోయిండు.

ఈ అనుభవలన్నిటితోపాటు ఆనాటి మీడియాను నెమరువేసుకోవలసిన అవసరమూ ఉంది. ఎలక్ట్రానిక్ మీడియా ఊసేలేదు, ప్రింట్మీడియా ఉన్నా న్యూసంతా యథాలాపంగా ఉండేది.

ఇంతా చేసి చెప్పొచ్చే విషయమేంటంటే నాయకత్వ శ్రేణిలో లక్ష్యం దిశగా పనిచేసినా, వయస్సు పరిమితులను లెక్కచేయకుండా శ్రమకోర్చి సంయమనంతో సహనంతో ధైర్యంతో సాహసంతో పనిచేసినా, ప్రింట్ మీడియాలో వచ్చే పేర్లన్నీ, నాయకులవో, వాళ్ళ చుట్టాలైన ఆడవాళ్ళవో.

ఆంధ్రా ఉద్యమం ఫేక్ ఉద్యమం కదా? అందుకే కొందరు మమ్మల్ని ఎంత పే చేసేవాళ్ళని ప్రశ్నించి అవమానించి తిట్టిన సందర్భాలూ ఉన్నాయి. ఉద్యమం కారణంగా తెలంగాణా విద్యార్థులమందరం ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయినం.

ఏది ఏమైనా ఈ ఉద్యమం జీవిత పోరాటంలో స్త్రీలు ఎన్నో సామాజిక ఉద్యమాల్లో పాలుపంచుకోవడానికి, తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి నాంది పలికింది. ఆ క్రమంలోనే 1974లో వరంగల్లో గాంధీ పార్క్లో పి.ఓ.డబ్ల్యు ఆవిర్భావ సదస్సును ఏర్పాటు చేసినం. వేలాదిగా విద్యార్థులు వచ్చిన్రు. ఆ సభకు కూడా నేనే అధ్యక్షత వహించిన.కానీ 1975లోనే ఉద్యోగం రావడంతో పి.ఓ.డూబ్ల్యుతో సంబంధం లేకుండా పోయింది.మొత్తానికి 69 ఉద్యమ స్ఫూర్తి నన్ను 2009లో కూడా క్రియాశీలకంగా పనిచేసేందుకు బలాన్నిచ్చింది. మహిళా జెఎసిలో ఉద్యమకారిణిలతో కలిసి భాద్యతలు పంచుకొని పనిచేసిన అనుభవం ప్రజా ఉద్యమాల గురించి ఎన్నో పాఠాలు నేర్పింది.

# మా తెలంగాణ మాగ్గావాలె

## (నా జైలు అనుభవం)

***1969*** ***బోగ్గం సక్కుబాయి***

ఆ రోజులను తల్సుకుంటే ఉత్తేజం వొస్తది. సుట్టాలు–పక్కాలూ, పెండ్లిల్లూ–పేరంటాలు, పిల్లలూ–కాపురం అన్కుంట సంసారంల నిండ కూరుకుపోయి ఇంట్లనే ఉండేదాన్ని. ఇంతల 1969 తెలంగాణ ఉద్యమం మొదలైంది. మా ఆయన (బోగ్గం శ్యాంరావ్) ఆర్యసమాజిస్టు. పొద్దున లేస్తే రాత్రి దాంక సమాజసేవ అన్కుంట తిరిగే మనిషి. చంచల్‌గూడ గవర్నెంట్ ప్రెస్‌ల ఆయన చేసే ఉద్యోగమే మా కుటుంబానికి ఆధారం. అందుకే పని పోగొట్టుకోకుంట కష్టపడుతనే ఉద్యమం కోసం పేరు కన్పించకుంట పనిచేసేటోడు. ఆయన వల్ల నేనే కాదు మా సుట్టుపక్కలోల్లు ఎంతోమంది ఉద్యమంలకి వచ్చింద్రు.

కాలేజీ పిల్లల వల్ల ఉద్యమం జోరుగ సాగుతున్న సమయంల ఇంకమేం ఆగలేకపోయినం. ఆడోళ్ళందరం కలిసి ఒక పెద్ద జులుస్ తీయాలని నిర్ణయించుకున్నం. ఆయన (శ్యాంరావు) అందర్ని జమచేసేదానికి నడుం కట్టిండు. నేను కూడ ఆయనకు తోడయిన. నాకప్పటికి సన్న పిలగాడుండె. వాన్ని సంకనేసుకొని అందర్ని కల్సెటందుకు కలెదిర్గిన. పాన్ డబ్బా నడిపే ఆకుల పెంటమ్మ, మణి లాంటోళ్ళు అందర్ని పోగేసేటందుకు తెల్లార్లు పొద్దుంకులు పనిచేసింద్రు. మల్లారెడ్డి అనేటాయాన మా కౌన్సిలర్‌గుండె అప్పుడు. మా సుట్టు పక్కలున్న కుర్మగూడ, మాదన్నపేట, శావని (నాదర్‌గుల్) కాలనీలను కల్పుకొని ఊరేగింపు తీయాలనుకున్నం. అప్పుడు శ్యాంరావు (కుర్మకూడ), పురుషోత్తం రెడ్డి (మాదన్నపేట), కిషన్‌రావు (శావని), వెంకటేశ్ (సైదాబాదు)లు కూడ తెల్లార్లు పనిచేసింద్రు. మేం అన్కున్న రోజు రానే వచ్చింది. పొద్దున్నే సైదాబాదు జైహింద్ హొటల్ ముంగట 4,5 వందల మంది ఆడోళ్ళం బారులు తీరినం. నేను నా పిల్లగాన్ని సంకన బెట్టుకొని ఊరేగింపు మొదటి వరుసల నిలబడిన. పెంటమ్మ, మణెమ్మ గూడ్క నాతోపాటుండిరి. బ్రహ్మానందరెడ్డి ఇషారాతో పోలీసులు చేస్తున్న జులుంకి మేమంత మండిపడుకుంట నినాదాలతో బైల్దేరినం. కొంతమంది "పోలీసుల జులుం నశించాలె" "జై తెలంగాణా" అని రాసిన అట్టలు పట్టుకొచ్చుకున్నరు. మా ఊరేగింపు మొదలైంది. అంతమంది ఆడోల్లు దన్న దన్న నడుస్తుంటే జనాలు ఇండ్లల్లకెల్లి ఉరికొచ్చి జై కొట్టడం నాకిప్పటికి గుర్తుంది.

నేనెన్నడు ఎరగని ఉల్లాసంతో నా మనసు నిండింది. తెలవని ధైర్యం వొచ్చింది. ఊరేగింపు మొదలవంగనే పోలీసులు మమ్ములను కమ్ముకున్నరు. భారీగా సాగుతున్న మా

జులుస్‌ను చాదర్‌ఘాట్ వద్ద అడ్డుకున్నరు. లాఠీ చార్జి చేయడం మొదలు పెట్టిండ్రు. దొర్కిన వాళ్ళను దొర్కినట్లుగా లారీలల్లకు దొబ్బి జడ్జిఖానా (సిటీ సివిల్ కోర్టు)కు తీస్కపోయిండ్రు. పోలీసుల లాఠీచార్జిల దెబ్బలు తగిలి పంతం పెరిగి మేమంత మరింత గట్టిగ నినాదాలు చేయడం మొదలుపెట్టినం. మాలో దెబ్బలు తగిలిన కొందరం మా రక్తంతో కోర్టుగోడల మీద "జై తెలంగాణ" అని రాసినం. పొద్దునకెల్లి ఏం తినక ఓ దిక్కుకండ్లు తిరుగుతున్నది సాలదన్నట్లు నా సంకలున్న బిడ్డకు జరం తగులుకొని నా పరేషాన్‌ని రెండింతలు చేసింది. కోర్టుల జడ్జి అడిగిన ప్రతిదానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఊపిరాడకుంట చేసినం. మా తెలంగాణ మాగ్గావాలె అని గట్టిగ అరిచినం. ఇంగ తట్టుకోలేక ఆయన మమ్ములను చంచల్ గూడ జైలుకు రాసిండు.

ఇంగ మమ్మల్నందర్ని లారీల ఎక్కిచ్చి చంచల్‌గూడ దీస్కపోయిండ్రు. కాని జైల్ల సోటు లేదంట. మమ్మల్ని ముషీరాదాబ్‌కు తీస్కపోవాలని అటిటు ఉర్కుతున్న పోలీసోల్లకు అక్కడ కూడ సోటులేదని తెల్సింది. జైల్లన్ని నిండుకొని ఎక్కడ సోటు లేదంట. బళ్ళు, సర్కారు బిల్డింగులను కూడా జైల్లుగా వాడాలని సూస్తున్నరంట. ఇక మాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. 4,5 వందల మందిమి, పోయి రోడ్డుమీద బైటాయించినం. "బ్రహ్మానందరెడ్డి డౌన్ డౌన్" "పోలీసుల జులుం నశించాలె" "మా తెలంగాణ మాగ్గావాలె" అని నినాదాలు చేసినం. ఇంక చేసేదేం లేక పోలీసోల్లు మమ్మల్నందర్ని చంచల్‌గూడ మహిళాజైల్ల నింపిండ్రు. ఐతే 3 నెల్ల వయసున్న నా కొడుకుని నా భర్తకు అందిచ్చి "సన్న పిలగాన్ని అనుమతించం" అని కొర్రీ పెట్టిండ్రు. నన్ను లోపలికి తోసిండ్రు. సల సల కాగుతున్న జరంల పిలగాడు ఎట్లున్నడో అని నా ప్రాణం కొట్టుకున్నది. "పిలగాన్ని నా కియ్యాలె" అని నేను పోలీసోల్లతో కొట్లాడుతునే వున్న పిలగాడు కండ్లు తేలేస్తున్నడని బైటి నుంచి నా భర్త, మిగిలిన వాళ్ళు పోలీసులతో కొట్లాడి లోనికి తెచ్చిండ్రు. వాని పరిస్థితి సీరియస్‌గైంది. ఊరేగింపు ద్యాసల పడి ఎండల సన్న పిలగాని ప్రాణం మీదికి తెస్తిని కదా అని నాకు దుక్కం పొర్లుకొచ్చింది. జైలు వాళ్ళు డాక్టర్‌ని పిలిపిచ్చిండ్రు. ఆయన పిలగానికి ఇంజక్షన్ ఇచ్చి, ఏదో మందు తాగిచ్చి పడుకోబెట్టని చెప్పి వెళ్ళిండు.

నా పరిస్థితి ఇట్లుంటే జైల్ల మాకందరికి తిండి తిప్పల కోసం బైట నా భర్త గల్లి గల్లి తిరుగుతుండే. ఐతే జైలు వాళ్ళు మా కందరికి అన్నం, కూర ఏర్పాటు చేసి పిల్సిండ్రు. ఉద్రేకంల వున్న మేమంత అప్పుడు సప్పుడు గాకుంట అన్నం ఆకులు తీస్కొని పక్కకు పోయి ఓ దగ్గర గుండ్రంగా గిర్రగీసిన సోట కుప్పపోయబట్టినం. ఎవరికొచ్చిన ఆలోచనో తెల్వది గానీ మేమంత ఒక్కమాట మీద నిలబడిన క్షణాలవి. పొద్దున కెల్లి తిండిలేక ఆకలికి నక నక లాడుతున్నా మేమందరం ఆ అన్నాన్ని తీస్కపోయి కుప్పగ పోయబట్టినం. జరుగుతున్నదేందో తెల్వక జైలు సిబ్బంది విస్తుపోయి చూస్తుండ్రు. వందలమంది పోసిన అన్నం కుప్ప నా ఎత్తైంది. అందరం పోసినంక ఇంక మేమంత కుప్పసుట్టు తిరుక్కుంట 'బ్రమ్మానంద రెడ్డి' దినం అంటూ

బొడ్డెమ్మలేసినం. అన్న కుప్ప పిండంగా పెట్టి బ్రమ్మానంద రెడ్డికి దినం పెట్టినమన్నమాట. బ్రమ్మానందరెడ్డి భార్య రాఘవమ్మ భర్త పోయి సోకాలు పెడుతున్నది అన్నట్లు కొందరు రాగాలు దీస్కుంట శోకాలు పెట్టింద్రు. ఇక మాకు తట్టుకోలేక జైలు సిబ్బంది "మీకేం కావాలె చెప్పండి' అని దీనంగా బతిమాలుకోవడం మొదలు పెట్టింద్రు. మేమంత ఒక్కపెట్టున 'చెన్నారెడ్డి'ని పిలిపియండ్రి, ఆయనకే చెబ్తం, ఆయన వచ్చి మాకు అన్నం ఏర్పాట్లు చేయాలె, అంత దాకా తినం' అని పట్టుబట్టినం. ఆఖర్కి మా బాదపడలేక చెన్నారెడ్డిని జైలుకు తీసుకొచ్చింద్రు. ఆయన మాతో మాట్లాడి, అన్నం ఏర్పాటు స్వయంగా చేపిచ్చినంకనే మేం ఎంగిలి పడినం. అప్పట్కి నా కొడుక్కు కొద్దిగ జరందిగి నిద్రపోయిండు. మమ్మల్ని 3 రోజులు జైల్లో వుంచి ఇంక తట్టుకోలేక వొదిలేసింద్రు.

## ఆమరణ నిరాహార దీక్ష-నాటి నా అనుభవం

***1969*** ***బిరుదురాజు రమాదేవి***

కన్వీనర్, తెలంగాణ విద్యార్థినుల కార్యాచరణ సంఘం

ఎగిసిపడే అలలవలే 1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమం పట్నవాసాల నుండి పల్లెపల్లెకు వ్యాపించింది. నాయకులు నిర్వహించిన సదస్సులలో ఉత్సాహంగా పాల్గొన్నారు ప్రజలు. అశేష ప్రజానీకానికి ఒక్కటే ఆలోచన, తెలంగాణా రాష్ట్రం రావాలని, ప్రజలంతా ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని నడిపినారు. వేల వేల ఉద్యమ రథసారథులు పుట్టుకొచ్చినారు. తెలంగాణా ఉ ద్యమహోరు ప్రజలను ప్రభావితం చేసింది. తెలంగాణా రాష్ట్రాన్ని సాధించాలనే తపన అందరిలో కలిగింది. క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సదస్సులలో ప్రజాదరణ చూస్తుంటే మాతృభూమికై మరణించినా మంచిదనిపించింది.

హైస్కూలు నుండి కాలేజీ విద్యార్థుల వరకు అందరూ చదువులకు స్వస్థి చెప్పి, తెలంగాణా ఉద్యమాన్ని స్వాగతించినారు. తమ చదువు, భవిష్యత్తు, ప్రాణాలు పోయినా పర్వాలేదని తెలంగాణా గడ్డ మట్టిని నుదుట తిలకంగా దిద్దుకుని తెలంగాణా రాష్ట్ర సాధనకై వీర జనవాసులవలే ఉ ద్యమ పోరుబాటలో పయనించినారు తెలంగాణా బిడ్డలు.

" గల్లీ గల్లీమే నారాహై తెలంగాణా హమారాహై " జై తెలంగాణా అన్న నినాదాలు యావత్తెలంగాణా నినదించింది. పోలీస్ లాఠీలకు, తూటాలకు, బాష్పవాయువులకు బెదరకుండ ఎదురు నిలిచినారు మన తెలంగాణా ప్రజలు. "జైల్ భరో" కార్యక్రమంలో సమస్త జనులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఎటు చూసినా బందులు, హర్తాళ్ళు, కర్ఫ్యూతో తెలంగాణా కంపించింది.

ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడినారు తెలంగాణా బిడ్డలు. ఉద్యమకారుల రక్తం ఏరులై పారినా, ఆస్తి, ప్రాణనష్టం జరిగినా కనికరించలేదు ఆంధ్రపాలకులు, సుమారు 400 వరకు అమరులైనారు.

అక్టోబరు 1969లో రాష్ట్ర సాధనకై నాటి వైద్య విద్యార్థి శ్రీ మల్లికార్జున్ గారు ఆమరణ నిరాహారదీక్ష చేసినారు.

తెలంగాణా విద్యార్థినుల కార్యాచరణ సంఘం కన్వీనర్‌గా, హైస్కూల్ విద్యార్థినిగా వున్న నేను అమరుల ఆత్మశాంతికై తెలంగాణా రాష్ట్రసాధనకై ఆమరణ నిరాహారదీక్ష చేయడం అవసరమని భావించినాను. యావత్తెలంగాణా తరపున తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకై తేది 18, అక్టోబర్ 1969లో నారాయణగూడలో రాజబహద్దూర్ వెంట్రామారెడ్డి విగ్రహం సమీపంలో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించినాను.

నాటి మేయర్ లక్ష్మినారాయణ గారు, శ్రీ జి.వెంకటస్వామి (ఎమ్.పి.) గారు, మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్యగారు వారి సతీమణి మణెమ్మ గారు స్వర్గీయులు జె.ఈశ్వరీ బాయిగారు, సదాలక్ష్మిగారు, శాంతాబాయిగార్ల వంటి ప్రముఖుల ఆశీస్సులు పొందినాను. యావత్తెలంగాణా ప్రజలు నా దీక్షను సమర్థించినారు. రోజురోజుకు నీరసిస్తున్న నన్ను పరీక్షించిన డాక్టర్స్ నిరాహారదీక్ష కొనసాగిస్తే ప్రమాదమని తెల్పినా పాలక పక్షాలు కనిరించలేదు. తేది 24 అక్టోబర్ 1969 తెల్లవారుజామున పోలీసులు నన్ను బలవంతంగా అరెస్టు చేసినారు. నా దీక్ష భగ్నం చేసినారు.

రమాదేవి మరణించినదని రేడియోలో తెలుసుకుని వరంగల్, హనుమకొండ విద్యార్థులు హర్తాళ్ నిర్వహించినారు. జంటనగరాల విద్యార్థులు బస్సులకు నష్టం కలిగించారని తెలిసింది. ఆశయసిద్ధి కాలేదు. ఆస్థి నష్టానికి పరోక్షంగా నేను కారణం అయినందుకు చాలా ఆవేదన చెందినాను.

ఏ ఉద్దేశ్యంతో 1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఆరంభ మయ్యిందో, ఆ ఉద్దేశ్యం నెరవేరకుండా ఉద్యమం ఆగిపోయింది.అయినా " నివురుగప్పిన నిప్పులా " తెలంగాణా ప్రజల గుండెల్లో గూడు కట్టుకుని ఉంది. తెలంగాణా రాష్ట్ర సాధన. నిరాశ, నిస్ప ృహలతో రేపటిపై ఆశలు పెంచుకునే ప్రయత్నం చేస్తూ ఉద్యమానికి స్వస్తి చెప్పి చదువులకు స్వాగతం పలికినాము.


ఆంధ్రజనత

ఆమరణ నిరాహార దీక్షల విరమణ

ఆంధ్రజనత

1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమం జ్ఞాపకం చేసుకుంటున్న సమయంలో తెలంగాణా రాష్ట్రం వచ్చిందన్న వార్త విని ఆనందించాను, వెంటనే ఆవేదన చెందినాను. తెలంగాణా రాష్ట్రసాధనకై ఆత్మబలిదానాలు చేసుకున్న అమరులు గుర్తుకొచ్చి అశ్రుతర్పణం చేస్తూ వారికి నివాళులర్పిస్తున్నాను.

25/5/2014

तेलंगाना
(हैदराबाद)

: जयतेलंगाना राष्ट्र समिती :

मेरा व्यक्तिगत परीचय :- मेरा नाम यज, स्वदेशा है। मै अपने परीवार मे, माता, पिता तथा बडी बहन के साथ रहती थी। मेरे पुज्यपिताजी का नाम श्रीमान हरीनिवास टण्डन और माताजी श्रीमती रतन देवी टण्डन तथा मेरी बडी बहन का नाम कु० कमलेश था हम दोनो बहनो ने कक्षा दसवी तक पढाई कि उसके पश्चात हमारे परीवार मे पूरे सदस्य कांग्रेस पार्टी से समबन्ध रखते थे।

कांग्रेस पार्टी कि मिटिंग गांधी भवन मे होती थी जहां पर हर दो दिन या एक हफ्ते मे हम जब जाते थे मेरी बहन महिला मंडल कि प्रेसीडेन्ट भी थी और घर मे सिलाई सेन्टर मे महिलाओं को सिलाई का प्रशीक्षण भी देती थी। और समाज सेविका भी थी। मैने दसवीं के बाद हिन्दी प्रचार सभा से इन्टर, और डिग्री की परीक्षा दि।

सन १९६० मे तेलंगाने का आन्दोलन शुरू हुआ। मै और मेरी माताजी, तथा बहन कु० कमलेश ने भी भाग लिया था। उस समय का मेरा व्यक्तिगत अनुभव किस प्रकार था और कौन-कौन लिडर्स भाग लेते थे आन्दोलन मे मै लिखीत रूप मे नाम प्रस्तुत करती हूँ।

हम सब पुरुष तथा महिलायें सत्याग्रह मे भाग लेते थे। पुरुषो मे निम्नलिखीत नाम इस प्रकार है।

P.T.O

पुरुषो के वर्ग मे - डॉ० एम चन्नारेड्डी, डॉ० मदनमोहनरेड्डी, (श्रीमान)
नरोत्तमरेड्डी, जयपालरेड्डी, एम.एम. हाशीम, श्री टी.
अन्जय्या, श्री जलगम वेन्गलराव, श्रीवेन्कटेश्वरराव
और कई पुरुषो ने भाग लिया था।

महिलाओं के वर्ग में - श्रिमती सावित्री देवी, श्रिमती
शान्ताबाई M.L.A. श्रिमती रतनदेवी रडन, कु०
कमलेश, कु० स्वदेश, कु० प्रभावती, श्रिमती शान्ता
श्रीवास्तव, श्रिमती कमलाठाकुर, श्रिमती ईशवरी बाई
श्रिमती आनंदा बिलगामी, श्रिमती नरसम्मा, श्रिमती ललीता
राव, श्रिमती सावित्री देवी, श्रिमती नरोत्तम रेड्डी श्रिमती
वसुधा सुदर्शन रेड्डी, श्रिमती सीन्धुताई आदि थे।

तेलंगाना कि मिटींग गांधी भवन मे होती थी सत्याग्रह या
धरने के बारे मे उसके पश्चात महिलायें, पुरुष
जयतेलंगाना के नारे लगाते हुवे हम सब पुराने शहर
के लाल चौरस्ते से अशोक स्तम्भ से सत्याग्रह
कि शुरुआत करते थे सवेरे 8 बजे से तो हमको
आबिड्स नेहरु स्टेच्यू के जाकर वहां पर धरने
पर बैठना होता था।

हम वहां पर नेहरु स्टेच्यू के जय तेलंगाना
नारे लगाते बार-बार पुलिस हमको खदेड़ती फिर

हमे और ज़ोरसे नारेबाजी करते पुलिस तंग आकर
हमपर आंसू गैस छोडती तब हम अपने पास से
प्याज़ नीकालकर आंखों पर मलते इतनी जलन होती
थी तो भी हम नारे लगाना नाहि छोडते इस प्रकार
दोपहर को दो बजे तक हमको पुलिस वेन मे बिठाकर
चेंचलगुडा जेल मे डालदेती वहा पर दो दिन रहते
जेल मे खाने व सोने, तथा दवाईयों का अच्छा प्रबन्ध
रहता था।

उसके बाद हम १९५३ मे हम ज़िलों पर भी गये
जैसे जडचर्ला, अलीपुर, ज़िलों कि कारों मे जाते
वहा पर भी दो तीन दिन रहते फिर हमको सरकार कि और
से "गंडीपेट" निज़ाम का एक स्थान है वहा बडी
मिटींग करके चन्नारेड्डी सब आन्दोलन कारीयों
को प्रमाणपत्र भेंट करे

सन् १९७५ मे हमको महिलायें, लिडरों और
पुरुषों के साथ दिल्ली भेजा गया। जहां पर हम सर्व प्रथम
प्रधानमंत्री श्रीमती इन्दागांधी जी से भेंट, और उनके
नीवास स्थान पर हमने फोटो भि खिंचवाई।

उसके पश्चात हम राष्ट्रपती भवन गये। उस
समय मनोनीत राष्ट्रपती डॉ. फखरुद्दीन अलि
अहमद थे उनसे भी भेंटकरने का सौभाग्य हमे
प्राप्त हुआ।

सन १९६२ मे हमारे पिताजी ने पैकाम मोमबत्ती
कि इन्डस्ट्री लगाये। जिसका उद्घाटन वेन्गलराव
तथा शान्ता ~~के द्वारा~~ बाई के द्वारा कराया गया।
जिसका नाम था। जुगनू कैण्डल्स। ~~था~~

१९६० से १९६९ तक तेलंगाना के आन्दोलनकारी
गोलियों कई लोग प्राणों कि बली दिये अब ४६ वर्ष
के पश्चात अब तेलंगाने कि उपलब्धी हुवी पिछले
दो वर्षों मे कई नवयुवकों ने आत्महत्या करके
तेलंगाना के लिये अपनी जवानी तथा भविष्य कि
खुर्बानी दी ईश्वर उनकी आत्मा को शान्ति दे, तथा अपनी
ओर से हृदयविदारक श्रद्धान्जली देती हूँ। और
तेलंगाना राज्य मे समृद्धी तथा सुख और शान्ति, अनुशासन
बनी रहे और तेलंगाना हमेशा प्रगति कि ओर
अग्रसर हो। यहि मेरी प्रार्थना है।



# జైలు ములాఖత్

## (జైలుతో అనుబంధం-అనుభవం)

***2009*** ***విమలక్క***

*కో-చైర్‌పర్సన్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్*

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో నా జైలు అనుభవాల గురించి రాయమని మిత్రులు, మిత్రురాల్లు పదేపదే కోరుతున్నారు. కొల్లాపురం విమల అడిగిన సందర్భంగా ఇవ్వాల్టికిలా సాధ్యమయ్యింది. అనుభవాలు రికార్డు చేయడం పదిమందికి పంచడం అవసరమే. కానీ ఎట్లా రాయాలి? ఏమి రాయాలి? జైలుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని రాయాలా! జైలులో పరిస్థితుల అనుభవాలు రాయాలా! ఏమి రాయాలో, ఎలా మొదలు బెట్టాలో తోచడంలేదు. అందుకే మొత్తంగా ఇలా రాస్తున్నాను. జైలు ములాఖత్‌లు, జైల్లో ఖైదు కావడం కొత్తగాకున్నా మూడు నెలలు చంచల్‌గూడ జైలులో నిర్బంధించబడటం తెలంగాణ ఉద్యమ ప్రత్యేక అనుభవమే అని చెప్పాలి.

ఈ విషయమే ఆలోచిస్తుండగా అనగనగా ఒక జైలు. ఆ జైలులో కమ్యూనిస్టుగా మా నాన్న. ఆ జైలులో ప్రజాకార్యకర్తగా నేను. ఆ జైలులో జనశక్తి నాయకుడిగా రాజన్న. ఆ జైలులో జీవిత సహచరుడు అమర్. ఆ జైలులో ఎంతోమంది ఉద్యమ సహచరులు. ఆ జైలులో అంతులేని ఖైదీలు. ఆ జైల్లో ఆజన్మ ఖైదీల్లాగా ఉండాల్సివచ్చే జైలు సిబ్బంది. ఆ జైలులోనూ సమస్యలు. జైల్లోనూ పోరాటాలు. ఖైదీల ఉద్యమానికి సంఘీభావం. ఇలా జైలులో అనుభవాలే కాదు. జైలుతో అనుబంధం ఉందని కూడా చెప్పాల్సి వస్తుంది. నా చిన్నప్పటి జ్ఞాపకాల జైలు ములాఖత్‌యే నాకు జైలు అనుభవంగా కూడా మారడం ఒక వాస్తవం.

నా చిన్నతనంలో ప్రజల పాటలు పాడుతూ మా తండ్రి బండ్రు నర్సింలు వెంట తిరిగే దాన్ని. మరి ఆ తండ్రి కూడా జైల్లో పడితే... జైలుకు వెళ్లి చూడాల్సిందే. అమ్మా జైలుకు పోదాం అని మారాం చేయడం, అమ్మ జైలుకు పోయినప్పుడల్లా వెళ్లి నాన్నను చూసి రావడంతోనే నాకు జైలుతో అనుబంధం ప్రారంభమయ్యింది. జైలుకు వెళ్లాల్సిన రోజు మా అమ్మ బండ్రు నర్సమ్మ చుక్కపొద్దు రాత్రి లేసేది. నాన్న కోసం తీసుకుపోవాల్సిందే కాదు. నల్లగొండ జిల్లా ఆలేరు నుండి బయలుదేరుతున్న మాకు తినడానికి సద్దిమూట సిద్దమయ్యేది. ఆలేరు నుండి హైద్రాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకో, సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్ జైలుకో, ఇలా మా నాన్నను జైలు ములాఖత్‌లో కలువడంతోనే జైలుతో నాకు పరిచయం ఏర్పడ్డది. మా నాన్న రాజకీయ ఖైదీ కావడం, మా అమ్మ-నేను ఆడవాల్లమే కావడంతో మాకు జైలు గేటు లోపల ములాఖత్ దొరికేది. నాన్నతో పాటు ఇతర ఉద్యమ సహచరులు, జైలు సిబ్బంది కలువడమే

కాదు. నాతో అక్కడ మా నాన్న పాటలు పాడిస్తుండేవాడు. నా పాటలు నచ్చి నాకు మిఠాయిలు తినిపించేవారు. మిఠాయిలు తింటే నా గొంతు ఇంకా తియ్యగవుతుందని చెబుతుండేవారు. ఏదయినా మా నాన్న కోసం ప్రారంభమైన జైలు ములాఖత్, ప్రజా ఉద్యమాల్లో జైలు, కేసులను ఎదుర్కొనే ధైర్యాన్ని స్థైర్యాన్ని అనుభవాన్ని ఇచ్చాయని చెప్పకతప్పదు.

నేను నల్లగొండ జిల్లా మహిళా ఉద్యమాల్లో పనిచేస్తూ, అత్యంత వెనుకబడ్డ ప్రాంతమైన దేవరకొండకు వెళ్లాను. చలకుర్తిలో అక్కడే ఒక దళిత స్త్రీని బట్టలు విప్పించి రోడ్లపై తిప్పిన సంఘటన మా POW (స్త్రీవిముక్తి) ముందుకు వచ్చింది. ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ చేసిన ఆందోళనలో నన్ను అరెస్టు చేసి నాపైనా ఒక తప్పుడు కేసుపెట్టారు. ఆ సందర్భంగా నల్లగొండ జిల్లా సబ్ జైలులో 4 రోజులు ఉండటమే గాకుండా సంవత్సరాల తరబడి ఆ కేసులు నడిచాయి. ఇలా సారా వ్యతిరేక ఉద్యమంలో, కరీంనగర్‌లో ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణా సదస్సులో పలుమార్లు అరెస్టులు, జైల్లు చవి చూశాను.

అయితే వీటన్నింటికి భిన్నంగా తెలంగాణ ఉద్యమంలో అరుణోదయ ప్రజా కళాకారిణిగా, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (TUF) కో-చైర్‌పర్సన్‌గా మేము ఒక విశిష్టమైన పాత్ర నిర్వహించాము. 1) తెలంగాణలోని సహజవనరులను కాపాడుకుంటూ నిండు తెలంగాణకు కృషి చేయడం 2) తెలంగాణకు అడ్డంకిగా ఉన్న వలసకుబేరుల అక్రమాస్తులపైన జనప్రతిఘటన మోగించడం 3) విశాల ప్రాతిపదికపై తెలంగాణ ఉద్యమశక్తులను ఏకం చేసి పోరాటాల ద్వారానే తెలంగాణ సాధించడం 4) తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడం 5) దేశీయ నమూనాలో తెలంగాణ నవనిర్మాణానికి పూనుకోవడం. స్థూలంగా ఇవే మా కార్యాచరణలోని ప్రత్యేకాంశాలు. దీనికి అనుగుణంగానే కార్యక్రమం రచించుకొని ఆచరించడము జరిగింది. ఓట్లు-సీట్ల రాజకీయాలకు అతీతంగా ఉంటూ ల్యాంకోహిల్స్, ఎమ్మార్ ప్రాపర్టీస్, శంషాబాద్ ఏర్‌పోర్టు, పటాన్‌చెరు టోల్‌గేట్, మంత్రుల ఇండ్లను ఘెరావ్ చేయడం, ఆదిలాబాద్ టైగర్ జోన్ (అభయారణ్యం) నిర్వాసిత సమస్య, కుంటాల జలపాతం రక్షణ తదితర అనేక డజన్ల కొలది ఘటనల్లో వేలాదిమందితో ప్రచారం చేశాము. ప్రజా ప్రతిఘటనా బేరీ మోగించాము. రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లో గుట్టలు, వాగులు, అడవులు, నీల్లు, కాలువలు, చెర్లు తదితర సహజవనరుల రక్షించే పోరాటాలు, సుదీర్ఘ పాదయాత్రలు ఒకటేమిటి తెలంగాణ పది జిల్లాల్లో చెయ్యని కార్యక్రమం లేదు.

ఇక 2009 డిసెంబర్ 9 పార్లమెంటులో తెలంగాణ ప్రాసెస్ ప్రారంభమవుతుందని చెప్పిన హోంమంత్రి చిదంబరం, తన ప్రకటన నుండి వెనక్కుపోయిన తర్వాత మూడు నెలలు అసలు మేము భూమిపైన పడుకోలేదంటే అతిశయోక్తి కాదు. వందలాది ధూంధాంలతో కార్యక్రమం నుండి కార్యక్రమానికి ప్రయాణం చేస్తూ వాహనాల్లోనే నిద్రాహారాలు గడిచాయి. ఈ సందర్భంగా